# హాస్యానందం

సంపూర్ణ హాస్య మాస పత్రిక

తెలుగులో
వెలువడుతున్న
ఏకైక
హాస్య మాస పత్రిక


సెప్టెంబర్-2022

వెల: రూ.20




శ్రీ గుదిబండి
వెంకటరెడ్డి గారు
నిర్వహించిన
కథల పోటీలో
బహుమతి పొందిన
కథల
ప్రత్యేక సంచిక

ఉత్తరం రాస్కో!
దక్షిణ(ం) తీస్కో!!



Smile in every page...
Satisfaction in every Smile



చవకబారు వస్తువులు విలువైనవి
కావు...
విలువైన వస్తువులు చవకగా
ఉండవు!!

Jaquar

**Sambamurty Enterprises**

12-10-04, Convent Street, Vijayawada-520 001.

fone: 0866-2563824, 9676444548

తెలుగులో వెలువడుతున్న ఏకైక హాస్యమాస పత్రిక

# హాస్యానందం

ఆనందానికి సాక్ష్యం నవ్వు!


సెప్టెంబర్-2022

20వ సంవత్సరం

219 వ సంచిక



*Publisher& Editor-* *Ramu.P*

*Full Pillar* : Bnim

*Cartoon Feature Editor*: Bachi

*D.T.P:* P. Ramalakshmi, 9440304993

*Digital Media Director:* Surya

*Well Wishers:*
Dr.K.V.Ramanachary, (I.A.S.Retd)
Tanikella Bharani
Dr.Sudarsan
K.V.V.Satyanarayana
Dr.V.V.Rama Kumar
Gudibandi Venkata Reddy

*Prize Sponsers*
K.V.V.Satyanarayana,
VisweswaraRao
Cartonist JSR
K.Sundaresayya&
Satyavathi
J.Nageswara Rao


*Creative Team*
Kandlakunta SarathChandra
Vadlamannati Gangadhar
Krishna
GopalKrishna
Venkat
Ramsheshu
Nagisetty



సంవత్సర చందా-రూ.300/-
(పోస్టల్ చార్జీలతో)

2 సంవత్సరాల చందా-రూ.500/-
(పోస్టల్ చార్జీలతో)

జీవిత చందా- రూ.5000/-లు

ముఖచిత్రం:
అనుపమ పరమేశ్వరన్


Editorial Office:
**HASYANANDAM**
# 8-215/4, Near Ramalayam,
**Po:YERRABALEM-522 503**
Mangalagiri Mandal, Guntur dist.
*Ph* : **9849630637**

email:
**hasyanandam.mag@gmail.com**
web:
**www. hasyanandam.com**



**Hyderabad & Secunderabad Distributor:**
M.Panduranga,
**Risingsun News Agency**
Abids, Hyderabad.
Cell. 9666680857.



గమనిక:
ఈ పత్రికలో ప్రచురింపబడే వ్యంగ్య, హాస్య రచనలు, కార్టూన్లు కేవలం హాస్యం కోసం ప్రచురించినవి మాత్రమే. ఏ వ్యక్తిని గాని, సంస్థని గాని కించపరచాలన్నది మా అభిమతం కాదు. ఈ పత్రికలో ప్రచురించిన రచనలన్నీ ఆయా రచయితల వ్యక్తిగత అభిప్రాయాలు మాత్రమే.


Smile in Every Page...Satisfaction in Every Smile

# ఎక్కడెక్కడ ఏమేమున్నాయి?...

**శ్రీగుదిబండి వెంకటరెడ్డిగారు నిర్వహించిన కథల పోటీలో బహుమతి పొందిన కథలు**


| | | |
|---|---|---|
| ఫిర్ అంటే తుర్ | -వసుంధర | -12 |
| అతిథి దేవుళ్ళు | -సింహప్రసాద్ | -15 |
| గొలుసు ధూమపానం | -గంగాధర్ వడ్లమన్నాటి | -18 |
| ఇరుగూ పొరుగూ అన్నాక | -కె.ఎన్.వి. ఆంజనేయులు | -20 |
| గుండెల్లో గులకరాయి | -గంటి ఉషాబాల | -23 |
| లావొక్కింతయు లేదు | -ఓట్ర ప్రకాష్ రావు | -26 |
| ఎగిరిపోతే ఎంత బాగుంటుంది | -పద్మావతి తల్లోజు | -28 |
| 'పాళీ పదకేళీ విన్యాసం' | -తెలికిచెర్ల విజయలక్ష్మి | -30 |
| భలే మంచి చౌక బేరమూ | -కోటమర్తి రాధా హిమబిందు | -32 |
| పక్కింటావిడ | -కట్టా రాంబాబు | -34 |


న్యాయ నిర్ణేత: **డాక్టర్ రావెళ్ళ శ్రీనివాసరావు**

## కథలు...


| | | |
|---|---|---|
| **నేను అనుకున్నాను!** | -అభిమన్యు | **-38** |
| **నిరాహార దీక్ష** | -జి.రంగబాబు | **-41** |
| **భూషయ్య** | -యు.విజయశేఖర రెడ్డి | **-43** |
| **అద్దం తిరిగిన ప్లాన్!** | -కుంతి | **-48** |


## శీర్షికలు


| | | |
|---|---|---|
| **'పన్'చదార చిలుకలు** | -శంకరనారాయణ | **-7** |
| **ఈనెల ప్రోత్సాహక బహుమతులు** | | **-8** |
| **నవ్వులాట** | -గాంధీ మనోహర్ | **-10** |
| **తర్కారావు కథలు** | -గంగాధర్ వడ్లమన్నాటి | **-37** |
| **నవ్వించే రాగాలు** | -ఎన్.పి.ఎస్.రావు, విట్టుబాబు | **-42** |


## గీతలో సామెత

Dr. Putheti






కర్ర విరగకూడదు...పాము చావకూడదు!


సీరియల్
ఇందు చందు-నవ్వులవిందు
-కండ్లకుంట శరత్‌చంద్ర
**44**

**ఈ నెల ప్రత్యేకతలు**

దొంగ మనసు
**22**

బాచి అవార్డు -2022 పురస్కారం మరియు శ్రీసోమయాజుల శివరామయ్య, హైమవతి స్మారక కార్టూన్ల పోటీ విజేతలకు బహుమతి ప్రదానోత్సవం!
**25**

ఇలా కాదేమో!
**27**

తీరులు!
**40**




**ఈ సంచికలో కార్టూనిస్ట్‌లు**

- రామకృష్ణ
- సరసి
- లేపాక్షి
- గాంధీ
- డా॥ పూతేటి
- ప్రసిద్ధ
- ఎన్.పి.ఎస్.రావు
- సునీల్
- శర్మ
- బొమ్మన్
- నాగిశెట్టి
- ప్రేమ్
- పి.పి.నాయుడు
- డేవిడ్
- ఎమ్.ఎ.రవూఫ్
- బీవీఎస్
- చక్రవర్తి
- డి.శంకర్
- నాథ్
- టి.ఆర్.బాబు
- శంబంగి
- దొరశ్రీ
- కృష్ణ
- రఘు
- దాస్
- టి.భాస్కర్
- గౌతమ్
- ప్రసాద్ కాజ
- తోపల్లి ఆనంద్
- వందన శ్రీనివాస్
- సౌమ్య

**కార్టూన్ శీర్షికలు**


| | | |
|---|---|---|
| గీతలో సామెత | -డా॥ పూతేటి | **-4** |
| అబ్బాయి పెళ్ళి | -జయదేవ్ | **-13** |
| దెయ్యాల గోల | -ఎన్.పి.ఎస్.రావు | **-21** |
| లోకం తీరు | -కృష్ణ | **-31** |
| ఫొటోటూన్ | -రఘు | **-33** |
| నెలనెలా నవ్వుల వెన్నెల | | **-36** |

## హాయ్...సానందంగా...



**హాస్యానందం అభిమానులకు...**
**ఆప్తులకు... హాస్యప్రియులకు,**
**సన్నిహితులకు హాస్యాభివందనాలు!**

కొన్ని భ్రమలు బావుంటాయి... అవసరం కూడా! ఒక వ్యక్తి మనకి చాలా ఆత్మీయులనో...మరో ప్రముఖుడు మనకి చాలా సన్నిహితులనో... ఫలానా వ్యక్తి ప్రాణ స్నేహితులనో... అనే భ్రమలు(ఊహలు) మనల్ని చాలా ఉత్సాహంగా ఉంచుతుంది. ఇవన్నీ భ్రమలని ఎందుకన్నానంటే మనం అనుకుంటున్న ఆ వ్యక్తులు నిజంగా మన పట్ల అలా భావిస్తారా అనేది మనకి తెలియదు! వాటిని నిరూపించుకునేందుకు ప్రయత్నాలు చేసి, అవి నిజాలు కావు అని తెలుసుకుని బాధ పడకూడదనుకుంటే... ఎలాంటి నిరూపించుకునే ప్రయత్నాలు చేయకూడదు! 'నిజం' తెలిసి బాధ పడాల్సి వస్తుంది. ప్రేమికులు'నువ్వులేకుండా నేను బ్రతక లేను' అనుకునే మాటలు వింటూంటం... వాస్తవాల గురించి ఆలోచన పక్కన పెడితే... ఆ భావన బావుంటుంది కదా? ఒక కవి అన్నట్లు 'అనుబంధం ఆత్మీయత అంతా ఒక భూటకం' అని అనను కానీ... 'ఆత్మ తృప్తికై మనుషులు ఆడుకునే నాటకం'... అనేది మాత్రం వాస్తవం! ఆ ఆత్మ తృప్తి కోసం కొన్ని సందర్భాల్లో 'నటిస్తూనే' ఉండాలి! 'నిజా నిజాల జోలికి పోకుండా అందరితో కలిసి మెలిసి ఉండటమే ఆనంద హేతువు! ఏదో ఒక అద్భుతం జరుగుతుందని కొన్ని పనులు చేస్తాం... అవి అవుతాయో లేదో కానీ, అలా అనుకుంటే మాత్రం ఉత్సాహంగా ఉంటాము. ఆ భావనలు లేకపోతే రోజులు నిస్సారంగా గడిచి పోతాయి. మనం చేసే ప్రతి పని అవుతుందనే ఆశతో... మనకు తెలిసిన ప్రతి వ్యక్తీ మనకు చాలా ఆత్మీయులు... అనే భావనని ఎంజాయ్ చేస్తూ జీవన ప్రయాణం సాగిద్దాం... మనం ఆనందంగా ఉంటూ, మన చుట్టూ ఉన్న వాళ్ళందర్నీ ఆనందింపజేద్దాం!

అందరూ హాయిగా... ఆనందంగా...
ఆరోగ్యంగా... ఉండాలని కోరుకుంటూ.....






✦ **కె.అనూరాధ, బెంగళూరు**

ఆగష్టు హాస్యానందంలో వచ్చిన 'నవ్వులాట' కథ బాగుంది. అలాగే ఈ సంచికలో ప్రచురించిన 'పోరా' కథ సూపర్. పొట్టి పేర్లు ఫ్యాషన్ అనుకుంటారు గానీ దానివల్ల ఏర్పడే ఇబ్బందులు మాత్రం గ్రహించరు. ఈ సంగతిని నవ్వుల పూతతో రాసిన ఈ రచయిత్రికి అభినందనలు. అలాగే మధ్యపేజీలో యండమూరి గారి ప్రశ్నలకు సుదర్శనమ్ గారి సమాధానాలు సింప్లీ సూపర్! పత్రిక నిండుగా నవ్వుల పువ్వుల గుచ్ఛంలా మాకందిస్తున్న పత్రిక నిర్వాహకులకు అభినందనలు!



✦ **బి.వి.రాజారామ్, హైదరాబాద్**

సెప్టెంబర్ హాస్యానందంలో ఎడిటర్‌గారి హాయ్ సానందంగా శీర్షికలో 'పిల్లల పట్ల తల్లిదండ్రుల బాధ్యత' చాలా చక్కగా చెప్పారు. రాబోయే తరానికి మంచి సమాజాన్ని ఏర్పరచే బాధ్యత ప్రతి తల్లి దండ్రుల మీద ఉన్నది వాస్తవం! పత్రిక చాలా నీట్‌గా తయారు చేస్తున్న మీ కృషికి అభినందనలు!

✦ **పి.వెంకట రాజ్యలక్ష్మి, తిరుపతి**

నవ్వుల కోసమే... అదీ మా నవ్వుల కోసమే నిర్వహిస్తున్న హాస్యానందంకి ముందుగా మా కృతజ్ఞతలు! ఈ గజిబిజీ జీవితంలో ఈ పత్రిక వలన మేము రిలాక్స్ అవుతున్నామనేది నిజంగా నిజం! కథలు, కార్టూన్లు అన్నీ బావుంటున్నాయి. మీరన్నట్లు ఇంటిల్లీపాదిని అలరిస్తున్న పత్రిక హాస్యానందం!

## డాక్టర్ సుదర్శనమ్ గారికి రేలంగి హాస్య నట పురస్కారం!




తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సహకారంతో, యువకళావాహిని సంస్థ– **రేలంగి హాస్య నట పురస్కారం** ఈ సంవత్సరం ప్రముఖ హాస్య నటులు **డాక్టర్ సుదర్శనమ్** గారికి, సుప్రసిద్ధ రంగస్థల నటులు **శ్రీఎస్.రోశిరెడ్డి** గారికి ప్రదానం చేశారు.

'సాంస్కృతికబంధు' శ్రీసారిపల్లి కొండలరావుగారి సారథ్యంలో జరిగిన ఈ ప్రదానోత్సవంలో– ప్రముఖ నటులు శ్రీ సుబ్బరాయశర్మ, సి. హెచ్. వెంకటేశ్వరరావు, లంక లక్ష్మీనారాయణ, ఎస్.వి.రామారావు తదితరులు పాల్గొన్నారు.

డా॥ సుదర్శన్ తన స్పందనని తెలియచేస్తూ...కొన్ని యోగాలు కేవలం సుకృతం వల్ల కలుగుతాయి అని... ఇది అలాంటిదే అని వినమ్రంగా చెప్పారు. యువ కళా వాహిని సంస్థ వారికి తన కృతజ్ఞతలు తెలిపారు.

✦ **సుదర్శనమ్, హైదరాబాద్**



తెలుగు నవలకి ఓ కొత్త వడినీ, ఒరవడినీ మప్పి... మెప్పించి గ్లామర్ ని కట్టబెట్టిన శకం పేరు... యండమూరి! శైలికి అదో గ్రామర్(?), శిల్పానిది అదో గ్లామర్! ఆయన కన్ను ఓ ప్రిజం, ఆయన పెన్ను ఓ మెస్మరిజం, రచనలో ఆయనదో యూనీక్ 'మేనరిజం(!)'.

యండమూరి మృదు స్వభావం, సున్నిత మనస్తత్వం,భావుకత ఆయన అక్షరాల్లో ప్రతిఫలిస్తాయి...ప్రవహిస్తాయి! 'వెన్నెల్లో' ఆడుకునే 'ఆడపిల్ల' లంతా ఆయన అక్షరాలైపోయారు! వెన్నెలున్నా ఆడపిల్లలు 'కాలేని'(!) మగపిల్లలంతా చిన్నబోయారు!

ఆయన నవలా కన్నియలు వెండితెరని ఆకర్షించాయి...వెండితెర వాటిని కాంక్షించింది. అవి సినిమాలుగా ఈడేరి ప్రేక్షకుల్ని వరించాయి...అలరించాయి! దర్శకుడిగా యండమూరి పండించాల్సిన పసిడి పంటని వెండితెర ఇప్పటికీ మిస్సవుతూనే వుంది!!


నేను భావుకతకి అభిమానిని...ఆయన రచనకి అభిమానిగా మారిన పాఠకుడిని! హాస్యానందం లో 'ఫన్ ప్రశ్నలు–పంచ్ సమాధానాలు' శీర్షికకి యండమూరిగారు ప్రశ్నలు పంపటం, ఆయనకి 'హాస్యానందం రాము' గారి మీద, సుదర్శనమ్ గారి మీద(అయ్...అదేనండి, నా మీద) వున్న అభిమానానికి నిదర్శనమ్!!!

✦ **తనికెళ్ళ భరణి, సినీ నటులు**



యండమూరి గారి ఫన్ ప్రశ్నలకి, సుదర్శనమ్ గారి పంచ్ సమాధానాలు అద్భుతః!

✦ **రావు రమేష్ , సినీ నటులు**



యండమూరి గారు చమత్కారం గానూ, యూనిక్ గానూ అడిగిన ప్రశ్నలకి ... సుదర్శనం గారు తనదైన హాస్య ధోరణిలోనూ, ప్రొఫౌన్డ్ గానూ జవాబులు చెప్పిన తీరు సూపర్!!



# 'ఫన్'చదార చిలుకలు

'హాస్యబ్రహ్మ' డా॥ శంకరనారాయణ

*Cartoons: Ramseshu*




వేంకటేశ్వర స్వామి
వడ్డీ 'క్యాషుల'
వాడు



'టీకా' తాత్పర్యాలు చెప్పేవాళ్ళు పండితులు అన్నది నాటి మాట! వైద్యులు అన్నది నేటి మాట!




తెలుగు అక్షరాలు
'తల'కట్టు ఎత్తుకు తిరుగుతాయి



ఈ రోజుల్లో
బావుల్లో నీళ్ళు
తోడదము
'చేద'స్తమే!



మెడి'సిన్'...
అయ్యో 'పాపం'!




వలసకార్మికులది
'నడక'యాతన



డ్రైవర్లు 'బండి'తులు



బ్రహ్మచార్యం
'వన్'డర్‌ఫుల్



కూర్చుని తింటే
కొండలు
అరిగిపోతాయి...
అలా వద్దు
నిలబడి
తినమంటుంది-
బఫే!



పెళ్ళయితే
కొడుకు మీదే
కాన్'సన్'ట్రేషన్



కండక్టర్
పూజించేది
'చిల్లర'
శ్రీమహాలక్ష్మిని!



దవడ పెద్దది...వడ పట్టేంత ఉంటుంది!




పోస్టులు
పెట్టడం
'వ్యా'హాత్మకమే!



రచన మధ్యలో ఆపేసినా
'పెన్'డింగే!



## ఈ నెల ప్రోత్సాహక బహుమతులు

మన కార్టూనిస్ట్‌లను ప్రోత్సాహించాలనే సదుద్దేశంతో **కార్టూన్ ఇష్టులు** **శ్రీ కె.వి.వి.సత్యనారాయణగారు** ప్రతి నెలా హాస్యానందంకు వచ్చిన కార్టూన్‌లలోంచి **ఒక మంచి కార్టూన్‌కి** **రూ.1000/-లు** బహుమతిగా ఇస్తున్నారు.






**ప్రముఖ చిత్రకారులు**
**శ్రీ జె.నాగేశ్వరరావు గారు** ప్రతి నెలా హాస్యానందంకు వచ్చిన కార్టూన్‌లలోంచి **ఒక మంచి కార్టూన్‌కి** **రూ.500/-లు** బహుమతిగా ఇస్తున్నారు.









కార్టూన్‌ని ప్రాణంగా ప్రేమించిన **శ్రీమతి వాగ్దేవి జ్ఞాపకార్థం** కార్టూన్ కళని ఆరాధిస్తున్న కార్టూనిస్ట్‌లకు **వాగ్దేవి పురస్కారం-** ప్రతినెలా ఒక కార్టూనిస్ట్‌కి **1000 రూపాయలు &** **ప్రశంసాపత్రం** **శ్రీ వాగ్దేవి విశ్వేశ్వరరావు గారు** అందజేస్తున్నారు.

ఈ నెల పురస్కార గ్రహీత **–డి. శంకర్**






**కార్టూనిస్ట్ శ్రీ జె.ఎస్.ఆర్.**
(జె.శ్రీరామచంద్రమూర్తి గారు)
వారి తల్లి దండ్రుల జ్ఞాపకార్థం
కార్టూనిస్ట్‌లను ప్రోత్సాహించాలని
హాస్యానందంకు వచ్చిన కార్టూన్లోంచి
**ఒక మంచి కార్టూన్‌కి**
**ప్రతినెలా 500 రూపాయలు**
బహుమతిగా ఇస్తున్నారు.







కార్టూనిస్టులపై ప్రేమతో, వాత్సల్యంతో
**శ్రీకుప్పచ్చి సుందరేశయ్య,**
**శ్రీమతి సత్యవతి వార్లు** (కోవూరు)
కార్టూనిస్ట్‌లను ప్రోత్సాహించాలనే
సదుద్దేశంతో హాస్యానందంకు వచ్చిన
కార్టూన్లోంచి ఒక మంచి కార్టూన్‌కి
**ప్రతినెలా 500 రూపాయలు**
**బహుమతిగా ఇస్తున్నారు.**






**రామకృష్ణ ఫౌండేషన్**
**సమర్పించు కార్టూన్**



# నవ్వులాట

గాంధీ మనోహర్, 98490 51846

## అప్పు కావాలా నాయనా...

తెలుగు రాష్ట్రాల్లో లొల్లిపేట్ అనేది ఓ చిన్న సైజు సిటీ. గవర్నమెంట్ జనాభా లెక్కల ప్రకారం ఇందులో కొన్ని లక్షల మంది బతుకుతున్నారు.

ఈ సిటీకి పోలీస్ కమీషనర్ కొండబాబు.

కొండబాబు తన భార్య పుట్టింటికి వెళ్ళడంతో ఇంట్లో ప్రశాంతంగా నిద్ర పోతున్నాడు.

తెల్లవారు జామున ఐదు గంటలకు అతగాడి మొబైల్ ఫోన్ రింగ్ అయింది. అసహనంగా లిఫ్ట్ చేశాడు. వీరప్పన్ నగర్లో ఎవరో మర్డర్ అయినట్టు ఎవడో చెప్పి కాల్ కట్ చేశాడు. స్నానం కూడా చేయకుండా పర్ఫ్యూమ్ కొట్టుకుని బయలుదేరి పోయాడు కొండబాబు.

క్రైమ్ సీన్ దగ్గరకు వచ్చాడు కొండబాబు. మర్డర్ అయిన వాడి నుదిటికి రక్తంతో తడిసిన పది రూపాయల నోటు అతికించి వుంది.

హంతకుడు ఇలా మర్డర్ చేసిన ప్రతివాడి నుదుటికి పదిరూపాయల నోటుని అతికించడం ఆనవాయితీగా పెట్టుకున్నాడు.

చచ్చిపోయిన వ్యక్తిని ఉద్దేశించి– "ఇతను ఎవరో మీకు తెలుసా?" అని అక్కడ పనీపాట లేకుండా గుమికూడి వున్న జనాల్ని అడిగాడు కొండబాబు.

"నాకు తెల్సు సర్!... ఇతను మహాత్మా గాంధీ వైన్‌షాప్‌లో పని చేసేవాడు సర్!... ఒకరోజు నా దగ్గర డబ్బులు లేకపోతే నాకు అప్పుగా ఓ క్వార్టర్ బాటిల్ బ్రాందీ ఇచ్చాడు. తర్వాత నేను ఆ అప్పు తీర్చకపోయినా ఏమీ అనేవాడు కాదు. క్లుప్తంగా చెప్పాలంటే మన సున్న మారాజు సర్!" అని అక్కడున్న ఓ జూనియర్ సిటిజన్ అన్నాడు... రాని కన్నీళ్లు తుడుచుకుంటూ.

ఇంతలో... అంబులెన్స్ రావడంతో డెడ్ బాడీని పోస్ట్‌మార్టం కోసం తరలించారు.

నెల రోజుల్లో లొల్లిపేట్‌లో ఇది తొమ్మిదో మర్డర్... హంతకుడు ఎవరో ఇంతవరకు తెల్సుకోనందుకు కొండబాబును హయ్యర్ అథారిటీస్ అన్ పార్లమెంటరీ లాంగ్వేజ్‌లో తిట్టడం జరిగింది.

అన్యాయాన్ని అస్సలు సహించని న్యూస్ ఛానల్స్ వారు కొండబాబుని చేతకాని దద్దమ్మ అని ఎద్దేవా చేస్తూ... టీవీలో వార్తలు ఊదరగొడుతున్నారు. సోషల్ మీడియాలో కొండబాబు మీద మీమ్స్ చేస్తూ ట్రోల్ చేస్తున్నారు. వీటి వల్ల బాగా హర్ట్ అయ్యాడు కొండబాబు. హంతకుడు దొరికితే అరెస్ట్ చేయకుండా ఏకంగా ఎన్‌కౌంటర్ చేసేయాలన్నంత కసిగా వున్నాడు.

నెలరోజులు గడిచాయి... మరో మర్డర్ జరగకపోవడంతో హంతకుడు లొల్లిపేట వదిలి పారిపోయాడేమో... అని కొండబాబు డౌట్ పడ్డాడు.

ఈ నెల రోజులు డ్యూటీ చేయకుండా... ఇంట్లో కూర్చొని OTT లో క్రైమ్ అండ్ ఇన్వెస్టిగేషన్‌తో వచ్చిన అన్ని భాషల సినిమాలన్నీ చూశాడు. వీటివల్ల కిల్లర్ని ఎలా పట్టుకోవాలో కిటుకులు తెల్సుకున్నాడు.


ఒకరోజు తెల్లవారుజామున కొండబాబు బాత్‌రూమ్‌లో వుండగా ఫోన్ రింగ్ అయింది.

పరుగున వచ్చి ఫోన్ లిఫ్ట్ చేశాడు.

"సారూ!... టైటానిక్ చిట్‌ఫండ్ ఆఫీస్ ముందు ఓ మహిళను ఎవరో దారుణంగా మర్డర్ చేశారు... మీరు తొందరగా రండి!" అని కాల్ కట్ చేశాడు.

కోపంతో చేతిలో వున్న నీళ్ళ మగ్గుని గోడకేసి కొట్టాడు కొండబాబు.

అది గోడకు తగిలి బౌన్స్ అయి వచ్చి కొండబాబు తలకు కొట్టుకుంది.




క్రైమ్ సీన్ దగ్గరకు వచ్చాడు కొండబాబు.

చనిపోయిన మహిళ నుదిటికి రక్తంతో తడిసిన పది రూపాయల నోటు అతికించి వుంది.

ఇది కూడా ఆ సీరియల్ కిల్లర్ దుశ్చర్యే అని గ్రహించాడు కొండబాబు.

క్రైమ్ సీన్ దగ్గర వున్న ప్రేక్షక మహాశయుల్ని ఉద్దేశించి–

"ఈవిడ ఎవరో మీకేమైనా తెలుసా?" అని అడిగాడు కొండబాబు.

ఒకతను "నాకు తెల్సు సర్!" అని గుంపులో నుండి ముందుకు వచ్చాడు.

"ఎవరు ఈవిడ? అని అంటే...

"నా భార్య!" అని అన్నాడు ఏకాదశి అనే పేరుగల ఆ వ్యక్తి.

"మరి అదేంటీ శవం పక్కన కూర్చోని ఏడవకుండా అలా పక్కకు వెళ్లి ఎందుకు నిలబడ్డావ్?

"నేను ఇక్కడికి నాలుగన్నరకే వచ్చి చాలా సేపు ఏడుస్తూ కూర్చున్నాను సర్... మీరు నన్ను చూసి తిడతారేమోనని తమరు వచ్చే ముందు అలా పక్కకు వెళ్లి నిలబడ్డాను." అని అన్నాడు.

డెడ్‌బాడీని పోస్ట్‌మార్టంకు సాగనంపి ఏకాదశిని కొండబాబు పక్కకు తీసుకెళ్ళి- "ఏం జరిగిందో నిజం చెప్పు!?" అని అడిగాడు.

"రాత్రి నేను ఇంట్లో మందు తాగుదామని కూర్చుంటే మంచింగ్ కోసం ఏమీ లేవు... చీకులు తీసుకొస్తానని నా భార్య బయటికి వెళ్ళింది సర్!... తను ఎంతకీ ఇంటికి రాకపోయే సరికి విత్‌అవుట్ మంచింగ్ తాగేశాను... ఆ మత్తులో నిద్ర పట్టేసింది. తెల్లవారు జామున నాలుగు గంటలకు మెలుకువ వచ్చింది. అప్పుడు వెతుక్కుంటూ ఇక్కడకి వచ్చాను సర్! ఇక్కడకు వచ్చి చూస్తే నా భార్యామణి మర్డర్ అయి వుంది... అప్పుడునుండి ఇప్పటివరకు ఏడుస్తూ వున్నాను సర్!" అని అన్నాడు ఏకాదశి మళ్ళీ ఏడుస్తూ.

కొండబాబు అనుకోకుండా చెట్టు పక్కన నిలబడి వున్న ఓ వ్యక్తి కేసి చూశాడు. అతను కుమిలి కుమిలి ఏడుస్తున్నాడు.

అది గమనించి కొండబాబు అతని దగ్గరకు వెళ్లి- "నువ్వు ఎవరు?... ఎందుకు సిన్సియర్‌గా ఏడుస్తున్నావ్?" అని అడిగాడు.

"నాపేరు రత్తయ్య సర్! చనిపోయిన ఆవిడకు నేను పాతికవేలు అప్పుగా ఇచ్చాను." అని ఏడుపుని ఆపుకుంటూ అన్నాడు.

"ఏమయ్యా! ఆవిడ ప్రాణాలకంటే నీకు నీ పాతికవేలే ముఖ్యమా?"

"అది కాదు సర్!... ఇంతకు ముందు మర్డర్ అయిన తొమ్మిదిమంది కూడా నా దగ్గర అప్పు తీసుకున్న వాళ్ళే... వాళ్ళ అందరి మూలంగా నేను లక్షరూపాయల దాకా నష్టపోయాను!..." అని అన్నాడు ఏడుపువల్ల వచ్చిన చీమిడిని మోచేత్తో తుడుచుకుంటూ.

క్రైమ్ అండ్ ఇన్వెస్టిగేషన్ సిన్మాలు చూసిన ఇన్స్పిరేషన్‌తో కొండబాబుకి పుసుక్కున ఏదో ఐడియా తట్టింది.


"ఫ్లాష్ బ్యాక్ లో... ఐ మీన్ గతంలో నిన్ను ఎవరైనా అప్పు అడిగితే ఇవ్వనని అన్నావా?" అని రత్తయ్యను అడిగాడు కొండబాబు.

"గోవింద్ అనే వాడు ట్రాఫిక్ రూల్స్ పాటించకుండా... హెల్మెట్ పెట్టుకోకుండా, బైక్‌లో ర్యాష్‌గా వెళ్ళిపోతూ ఉంటాడు... అందుకని వాడికి ఎనీ టైం యాక్సిడెంట్ అయి పోతాడేమోనని ఊహించాను... అందుకే అతను అప్పు అడిగితే ఇవ్వనన్నాను సర్!" చెప్పాడు రత్తయ్య.

యుద్ధ ప్రాతిపదికన గోవింద్‌ని కొండబాబు పోలీస్‌స్టేషకు పిలిపించి, పొట్టమీద మోకాలితో నాలుగు బాదేసరికి నిజం కక్కేశాడు.

"రత్తయ్య నాకు అప్పు ఇవ్వకపోడంతో వాడి మీద కసి పెంచుకున్నాను... ఏదోవిధంగా వాడు నష్టపోయేట్టు చేయాలని తెగ ఆలోచించాను. అందుకే రత్తయ్య అప్పులిచ్చిన వాళ్ళని చంపుకుంటూ వచ్చాను!" అని అన్నాడు గోవింద్.

ఎట్టకేలకు కిల్లర్‌ని పట్టుకున్నందుకు తను ఓటీటీ‌లో చూసిన క్రైమ్ అండ్ ఇన్వెస్టిగేషన్ సిన్మాలకు మనసులోనే కృతజ్ఞతలు చెప్పుకున్నాడు కొండబాబు.




## ఉత్తరం రాస్కో!... దక్షిణ(ం) తీస్కో!!

మనం ఎన్నో రకాల ఉత్తరాలు చూస్తుంటాం!... రాస్తుంటాం!... అయితే అందులో విషయం కాస్త సీరియస్‌గానో... సమాచారం కోసమో అయిఉంటుంది. మనమిప్పుడు ఎలా జాబు (ఉత్తరం) రాస్తే 'నవ్వు' వస్తుందో అలాంటి ఉత్తరాలు రాసి

**నవ్వును రాజేద్దాం! బహుమతిని కొట్టేద్దాం!**

టీవీ సీరియల్‌లా కాకుండా ఒక పేజీకి మించకుండా ఉత్తరాలు రాసి హాస్యానందం ఈ మెయిల్‌కి పంపండి!

ఒకో ఉత్తరానికి **500** రూపాయల చొప్పున
**10** ఉత్తరాలకి బహుమతితో పాటు ప్రశంసాపత్రం!
సాధారణ ప్రచురణకై ఎంపిక చేసిన **10** ఉత్తరాల రచయిత(త్రు)లకు ఒక సంవత్సరం పాటు హాస్యానందం ఉచితం!

హాస్యానందం సౌజన్యంతో
**శ్రీ బాబు కొయిలాడ గారు,** తమ తండ్రి
**శ్రీ కొయిలాడ వెంకునాయుడు గారి**
పేరిట ఈ ఉత్తరాల పోటీ
నిర్వహిస్తున్నారు...



మీదే ఆలస్యం!

మీ ఉత్తరాలు పోస్ట్ డబ్బాలో వేయకుండా...

**hasyanandampoteelu@gmail.com**

ఈమెయిల్‌కి పంపండి!

**చివరి తేదీ: 20, అక్టోబర్, 2022.**

# ఫిర్ అంటే తుర్

వసుంధర, 9885620065



శ్రీగుడిబండి వెంకటరెడ్డిగారు నిర్వహించిన కథల పోటీలో బహుమతి పొందిన కథ

**1975లో అమితాబ్ బచ్చన్, ధర్మేంద్ర, హేమమాలిని, జయబాదురి వంటి పెద్ద తారలతో– షోలే అనే పెద్దల సినిమా ఒకటొచ్చి... బాక్సాఫీసు రికార్డులెన్నో బద్దలు కొట్టింది. హింస, క్రూరత్వం ఎక్కువున్నాయని పేరుపడ్డ ఆ చిత్రం గురించి సినీ రంగానికి చెందిన ఓ పెద్దాయన... "మనకి పిల్లల సినిమాలు లేకేం? షోలే ఉందిగా..." అన్నాడు వ్యంగ్యంగా.**


అదీ మన పెద్దల సినిమా కథల స్థాయి! ఇంత పెద్ద పాయింటెలా మిస్సయ్యానో– నా డెయిలీ సీరియల్ కథ విషయంలో!


విషయమేంటంటే– యూట్యూబులో నా షార్ట్ ఫిల్మ్ చూసిన ఓ టీవీ ప్రొడ్యూసరు ఫోన్ చేసి– "ఓ పెద్ద చానెల్ వాళ్లు నాకు ప్రైం టైములో డెయిలీ సీరియల్‌కి స్లాట్ ఇచ్చారు. కొత్త దర్శకుడి కోసం చూస్తున్నాను. ఇంట్రస్టుంటే వచ్చి నన్ను కలు!" అన్నాడు.

వెంటనే ఓ కథ అనుకుని నాలుగు ఎపిసోడ్సు వ్రాసి ముందు నా భార్య విశాలాక్షికి వినిపించాను.

తను పెళ్లికి ముందు నవల్లు బాగా చదివేదిట... తెలివి విశాల మౌతుందని! తెలివి విషయమెలాగున్నా– చదివి చదివి కళ్లు చిన్నవై పోయాయి. మళ్లీ అవి విశాలం కావడానికి, పెళ్లయ్యేక డెయిలీ సీరి యల్స్ చూడ్డం హాబీ చేసుకుంది.






కళ్లు విశాలమయ్యాయి కానీ, తెలివి ఫ్!

నేను చదివింది విని పెదవి విరిచి–

“ఏమనుకోకు డియర్! నాకిప్పుడు వీడియో ఎంత అలవాటైపోయిందంటే– అమ్మ కూడా ఉత్తరాలు మానేసి, విడియో కాల్స్ చేస్తోంది. చదివిందీ, విన్నదీ బుర్రకెక్కడం లేదు!” అనేసింది.

దాంతో నేరుగా ప్రొడ్యూసర్నే కలుసుకుని నాలుగు ఎపిసోడ్స్ చదివి వినిపించాను.

ఆయనకవి తెగ నచ్చేసి...

“కొత్త కాన్సెప్టు. బాగా క్లిక్కవుతుంది. ఐతే మనది ప్రైమ్ టైమ్ స్లాట్ కదా? ఏడాదికో మూడొందల ఎపిసోడ్సు చొప్పున, కనీసం వెయ్యి ఎపిసోడ్సు రావాలి. ముందు నువ్వో వంద తయారు చేసి పట్రా!” అన్నాడు.

గుండె గుభేల్మంది. కథ చిన్నది. మహా అయితే పదమూడు ఎపిసోడ్సు అనుకున్నాను. ఎంత లాగినా మరీ వెయ్యంటే ఎలా?

‘ఒకొక్కరి యోగమే అంత!’ అనుకుని నిట్టూర్చాను.

✦ ✦ ✦

అప్పట్లో నాన్నకి ఇంజనీరింగులో సీటొస్తే, మా ఊళ్ళో పార్టీ చేశారుట.

ఇప్పుడు ఇంజనీరింగు కాలేజిలో శతకోటి లింగాల్లో నేనూ ఓ బోడిలింగాన్ని.

అప్పట్లో కాలేజి కల్చరల్ సెక్రటరీగా ఉండే బాబాయికి, అమ్మాయిల ఫాలోయింగుట. కొందరు ప్రేమలేఖలు కూడా వ్రాశారుట. నేను మా కాలేజిలో క్రికెట్లో ఓపెనింగ్ బ్యాట్సుమన్ని. నాటకాల్లో రచన–దర్శకత్వం–హీరో నేనే.

కానీ సన్నగా పీలగా వెర్రిమొహంతో కన బడే చంచల్‌కి ఉన్న ఫాలోయింగ్ నాకు లేదు. నేనే వెంటపడితే, అదేదో ప్రకటనలో– నీ టూత్‌పేస్టులో ఉప్పుందా– అనడిగినట్లు– నీ వాలెట్లో బక్సున్నాయా అనేవారు, నా మొహాన్ని చూడనైనా చూడకుండా!


చదువైంది. ఉద్యోగమొచ్చింది. హోదా మాత్రం ఇంకా బోడిలింగమే!


నన్ను చూసి, “నాకైతే ఏ టాలెంటూ లేక– ఉద్యోగంతో సరిపెట్టుకోక తప్పలేదు. నీది మామూలు టాలెంట్ కాదు– సూపర్, మహా, మెగా!” అంటాడు కొలీగ్ వంశీ.

పొగడ్డంలో తనకున్న మెగాటాలెంటు వల్ల– అమ్మాయిలతో సహా చాలామందికి అతడు డార్లింగ్.

నా టాలెంటుతో సినిమా డైరెక్టర్ని కావాలను కున్నాను.

“సడెన్‌గా డైరెక్టరవాలంటే నీ గాడూ... ఫాదరూ... సినిమావాళ్లయుండాలి!” అన్నాడో మిత్రుడు.






ఫాదరు సంగతి సరే... గాడ్ సినిమావాడెలా గవుతాడో అర్థంకాక– ఆ మిత్రుణ్ణే అడిగాను.

అతగాడు తడబడి– "గాడ్‌ఫాదర్– సింగిల్ వర్డ్ అని తెలియదు. ఇద్దరనుకున్నాను!" అని నాలిక్కరుచుకున్నాడు.

ఓసారి మన సినీదర్శకుల గురించి గూగుల్ సెర్చి చేస్తే– వాళ్లలో స్కూల్ డ్రాపౌట్స్, లారీ క్లీనర్స్ వగైరాలు చాలామందే ఉన్నారు.

ముందే తెలిసుంటే ఏమో కానీ, నాకిప్పుడలా కుదరదు. అందుకని ముందుగా ఏదైనా టీవీ సీరియల్ చేద్దామను కున్నాను. దానికో మిత్రుడు, "నీ లక్ష్యం సినిమా. సినీదర్శకులు టివి సీరియల్సు తీస్తున్నారు కానీ– సీరియల్సు తీసేవాళ్లకి సినీ అవకాశాలొచ్చిన సందర్భాలు లేవు. యూట్యూబులో షార్ట్ ఫిల్మ్స్ తియ్యి. తరుణ్ భాస్కరువి కావచ్చు!" అన్నాడు.

అలా కొన్ని షార్ట్ ఫిల్మ్సు తీసి... యూట్యూబులో పెడితే– పెద్ద పేరేం రాలేదు కానీ– ఓ టీవీ ప్రొడ్యూసర్నించి పిలుపొచ్చింది. నేను నా కథనే నాలుగు ఎపిసోడ్సుగా వ్రాసి చూపిస్తే ఆయన ఏకంగా వెయ్యి ఎపిసోడ్సు కావాలంటున్నాడు.

అప్పుడు షోలే సినిమా గుర్తొచ్చింది.

అది పిల్లల కథే ఐనా, వ్రాసింది పెద్దలు. నా సీరియల్ కథని పిల్లల చేతే వ్రాయిస్తే...ఈ ఆలోచన రాగానే నాకు బాబుల్ గుర్తొచ్చాడు.

వాడు విశాలాక్షి అక్క కొడుకు. వయసు పన్నెండు. కొన్నాళ్లుగా మా ఇంట్లోనే ఉండి చదువుకుంటున్నాడు. వాడికి కథలు చెప్పడం మహా సరదా.

చెబుతుంటే ఎప్పటికీ పూర్తికావని– చాలామంది వాణ్ణి సగంలోనే ఆపేస్తారని తెగ గునుస్తాడు. నేను బాబుల్‌ని పిలిచి, "ఒరేయ్! నాకో కథ చెప్పు! ఎంత పెద్దదైనా వినడానికి నేను సిద్ధం!" అన్నాను.


"పెద్ద కథలెవరూ వినడం లేదని, ట్రెండు మార్చేశాను. ఇప్పుడు చిన్నకథలు మాత్రమే చెబుతున్నాను!" అంటూ మొదలెట్టాడు...

ఓ సుల్తాన్‌కి కథలు వినే పిచ్చి. కథలెన్ని చెప్పినా తృప్తి పడక, ఇంకో కథ కోసం 'ఫిర్' అంటాడు. ఎవరైనా ఎన్నని చెబుతారు?... ఒకటో రెండో ఐదో పదో చెప్పేక, ఇక చెప్పలేక చెరసాల పాలయ్యేవారు. చివరికి ఆలీ అనే వాడొచ్చి సుల్తానుకో కథ చెప్పాడు.

అందులో ఓ చెట్టు.ఆ చెట్టు నిండా ఆకులు. ప్రతి ఆకుపైనా ఓ పిట్ట. ఒకసారి ఓ వేటగాడొచ్చి ఓ పిట్టని గురి చూసి కాల్చాడు.

ఆ పిట్ట 'తుర్' మంటూ ఎగిరిపోయిందని కథ ముగించాడు ఆలీ. సుల్తాన్ వెంటనే 'ఫిర్' అన్నాడు. ఇంకో పిట్ట 'తుర్'మంటూ ఎగిరిపోయిందన్నాడు ఆలీ. అలా సుల్తాన్ 'ఫిర్' అన్నప్పుడల్లా 'తుర్' అంటూ ఆయనకి జీవితకాలం కథ చెప్పాడు ఆలీ.

ముందు చిన్నకథని అసంతృప్తి చెందాను. కొంచెం ఆలోచించగానే... ఈ చిన్న కథ ఓ మెగా కథకు విత్తనంలా తోచింది... ఇప్పుడు నా కథకు వస్తే– నేను కాలేజిలో ఓ అమ్మాయి వెంటపడ్డాను. ఆమె తుర్. ఫిర్ ఇంకో అమ్మాయి. తనూ తుర్. ఫిర్ ఇంకో అమ్మాయి. తను కూడా తుర్. మొహాలు మారతాయి. కథ మారదు. అలా 'ఫిర్ అంటే తుర్' అనుకుంటూ– ఎన్ని ఎపిసోడ్సు కావా లంటే అన్ని. తర్వాత అంశాలు– నా ఉద్యోగ ప్రయత్నాలు. ఆఫీసులో మిత్రులతో సంప్రదింపులు. సినిమా ప్రయత్నాలు, షార్ట్‌ఫిల్మ్సు, వెయ్యేమిటి– ఆకాశంలో నక్షత్రాల్లా, సముద్ర తీరాన ఇసుక రేణువుల్లా–ఎపిసోడ్సే ఎపిసోడ్సు! తెలియకుండానే ఈ ఫార్ములాని ఇప్పటికే ఎందరో అనుసరిస్తున్నారు. తెలియని నా వంటివారి కోసమే మా బాబుల్ కథ!



# అతిథి దేవుళ్ళు

సింహప్రసాద్, 9849061668



శ్రీగుదిబండి వెంకటరెడ్డిగారు నిర్వహించిన కథల పోటీలో బహుమతి పొందిన కథ

**రూపాయల లెక్కలతో సంబంధం లేకుండా కూతురి పెళ్లి కుదిరినందుకు కుటుంబరావు పొంగిపోని క్షణం లేదు. అడిగినవారికి అడగనివారికి కాబోయే అల్లుడి మంచితనం గురించి చిన్న సైజు ఉపన్యాసం దంచేస్తున్నాడు.**

**కానీ పెళ్లిరోజు దగ్గర పడుతున్నకొద్దీ అతనికి భయం... గాభరా...ఆందోళన వరుసగా వచ్చేసాయి. బీపీ సైతం నేను తక్కువా అంటూ ముందుకు వచ్చేసింది.**

పెళ్ళికి కాబోయే అల్లుడు ఒక షరతు పెట్టాడు.

'పెళ్లికి మినిమం 500 మంది అతిథులు రావాలి!' అని!

"ఓస్ అంతేగా! మీ బంధువులూ, మా బంధువులూ కలిస్తే బొచ్చెడవుతారు." అనేసాడు.

"మాకు బంధువర్గం చాలా తక్కువ. ఎక్కడినుంచో వచ్చి ఇక్కడ స్థిరపడ్డ వాళ్ళం కదా!... బోలెడంతమంది జనం మధ్య పెళ్ళి చేసుకోవాలన్నది నా డ్రీమ్. మీరు నెరవేర్చితీరాలి." చేతులు పట్టుకుని మరీ ఆర్డరేసాడు.

"ఓయస్! " అనేసాడు స్వరం పెంచి ధీమాగా.

అప్పుడది బాయ్ హాథ్ కే ఖేల్ అనిపించింది. పిలవాలి గాని, భోంచేసి వెళ్ళడానికి లెక్కపెట్టలేనంత మంది వచ్చేసి క్యూ కట్టేస్తారనుకున్నాడు.

తీరా శుభలేఖలు అచ్చయ్యాక బంధుమిత్రుల పేర్లు రాస్తే 150



అయ్యాయి... వెనకనుంచి, ముందు నుంచి ఎలా లెక్కవేసినా పెళ్లికి వచ్చే జనం 250 దాటేట్లు లేరు!

అదిగో ఆ కారణంతోనే సిగ్నల్ అందని సెల్‌ఫోన్లా, గిలగిల్లాడిపోతున్నాడు సదరు కుటుంబరావు.

నెత్తిమీద మిగిలివున్న కాస్త జుట్టూ పీక్కున్నా 'అవిడియా' ఊడి పడలేదు. తన చవట తల లానే బ్రెయినూ చవటదై పోయిందనుకుని... ఒక ఏడ్పు ఏడ్చి మిత్రుడు రాంరావ్ ఇంటికి స్కూటర్ మీదెళ్లి పడి బేర్‌మన్నాడు.

సదరు రాంరావ్ లౌక్యంతో పనులు చక్క బెట్టడంలో దిట్ట అని గజం పొడుగు పేరుంది.

"ఏడ్చింది చాలు! మేటర్ సీరియస్‌నెస్ అర్థమయింది. ముక్కు తుడుచుకుని, మాస్కు పెట్టుకుని విషయం కక్కెయ్!"

ముక్కు ఎగబీలుస్తూ కళ్ళు తుడుచుకుంటూ చెప్పాడు.

"నువ్వే గట్టెక్కించాలి గురూ!" అన్నాడు.

"ఇదేమీ కాలిపోతున్న సమస్య కాదు. మీ వీధిలోని వాళ్ళందర్నీ పిలిచేద్దాం. గిఫ్టులు తీసుకోమని యాడ్ చేద్దాం. పరుగు పరుగున వచ్చేస్తారు. ఒకవేళ రాలేదనుకో. ఈ ఏరియాలో కరోనా కొత్త వేరియంట్ వచ్చిందనీ, అందుకనే జనం రాలేదనీ బుకాయించేద్దాం. నీ కాబోయే అల్లుడ్ని బుట్టలో పడేసి పూచీ వందశాతం నాది!" పిల్లి గెడ్డం సవరించుకున్నాడు.




తల అడ్డంగా ఊపి అన్నాడు– "అందుకు అవకాశం లేదు గురూ. 500కి ఒక్కరు తగ్గినా 'ఉచితకారు పెట్రోలు పథకం పెట్టాల'ని కండీషన్ తగలించాడు. నెలనెలా పెట్రోల్ ఖర్చు నేను ఇచ్చి చావాలట!" బావురుమన్నాడు.

"అయితే ఇది ముమ్మాటికీ ఏడవాల్సిన సందర్భమే. అయిన ఫర్వాలేదు. నేనున్నాగా!" అంటూ సింహాచలం దగ్గరికి లాక్కెళ్ళాడు రాంరావ్.

సింహాచలం రాజకీయ నాయకుల సభలకు జనాన్ని టోకుగా సప్లై చేస్తుంటాడు.

"ఒక్కొక్కరికి ఐదొందల రూపాయలు... బిర్యానీ పాకెట్లు ఇవ్వాలి. రాను పోను ట్రాన్స్‌పోర్ట్ ఖర్చు మీరే పెట్టుకోవాలి... మీకు ఎంత మంది కావాలో చెప్పండి. పంపించేస్తాను."

"300 మంది బెస్ట్. పెళ్ళి భోజనం ఉంది గనుక మనిషికి 500 చొప్పున ఇస్తాం!"

"భోజనంలో బర్యానీ వుండాలిసుమా! లేకపోతే ప్రత్యేకంగా వీళ్ళకోసం వండించి వడ్డించాలి. తేడా వస్తే పెళ్ళిపందిరిని కిష్కింధ చేసేస్తారు... జాగ్రత్త!"

నక్కని తొక్కి వచ్చామని పొంగిపోతూ... అడ్వాన్స్ ఇవ్వబోతుంటే... సింహాచలం అసిస్టెంట్ పరుగున వచ్చి సెల్‌ఫోన్ అందించాడు.

ఫోన్‌లో మాట్లాడుతూనే వాళ్ళని వెళ్ళిపొమ్మని సైగ చేసాడు. వెర్రిమొహం పెట్టి అయోమయంగా చూసారు.

"పెద్ద బేరం తగిలింది. పదివేలమందిని సప్లై చేయాలి." అంటూ లేచి వెళ్లిపోయాడు.

ఏడుపు ముఖం పెట్టాడు కుటుంబరావు.

"అన్నట్లు నేనూ మర్చిపోయాను. ఆరోజు పవన్‌కళ్యాణ్ మన టౌన్‌కి వస్తున్నాడు." చావు కబురు చల్లగా చెప్పాడు రాంరావ్.

"ఇంకిప్పుడు నిండా మునిగిపోయినట్టే గురూ... యూత్ ఒక్కరంటే ఒక్కరు పెళ్ళి పందిట్లో కనిపించరు!" కర్చీఫ్ నోట్లో కుక్కుకుని పెద్దగా ఏడ్చేసాడు.

"నన్నంత తేలిగ్గా తీసి పారేయకు... నా అంబులపొది లోంచి పాశుపతాస్త్రం బయటికి తీస్తాను. దీనికి తిరుగుండదు పద!"

కుటుంబరావుని, అన్ని పత్రికల స్థానిక ఆఫీసులకు తీసుకెళ్లి ఒక ప్రకటన ఇచ్చి వచ్చారు.



"నువ్వింక గుర్రు పెట్టి నిద్రపోవచ్చు."

పెళ్ళిపనులు బామ్మర్దికి అప్పగించేసి, బంధు మిత్రులందరికీ పెళ్ళికి తప్పనిసరిగా రావాలంటూ మళ్లీ మళ్లీ రిమైండ్ చేస్తూ, ప్రామిస్సులు తీసుకుంటూ హైరానా పడుతున్నాడు.

పెళ్ళి కార్యక్రమం మొదలైంది.

కుటుంబరావు... కళ్ళని ప్రవేశద్వారానికి అంటించేసాడు. అయిదు నిముషాలకోసారి హాల్లోని జనాన్ని కళ్ళతోనే లెక్కిస్తున్నాడు.

ఆరోజు వచ్చిన వాట్సాప్ మెసేజ్‌లన్నీ అన్ని గ్రూపులకూ పంపించేసిన వాడిలా కూనిరాగం తీస్తూ కూర్చున్నాడు రాంరావ్.

అతడిని పిలిచి– "గురూ!... 182 మందే వచ్చారు." అన్నాడు ఏడుపు ఆపుకుంటూ.

"పెళ్ళి మండపంలో నువ్వు ఏడిస్తే బాగోదు. మై హూనా!..."

"నా బదులు నువ్వు ఏడుస్తావా?"

కొరకొర చూసి, విసవిసా వెళ్ళి పోయాడతడు.

దిక్కు తోచలేదు కుటుంబరావుకి.

మరికాసేపటికే పంచెలాల్చీలు, పైజమా లాల్చీలు, ఫాంట్లు జుబ్బాలు, పట్టుచీరలు బిలబిలమంటూ వచ్చేసాయి.

వాళ్లు ఎవరో తెలియలేదు.

అయినా కుటుంబరావు కళ్ళు మెరిసాయి.

"వాళ్ళంతా ఎవర్రా!?"

"కవులు. కవి సమ్మేళనం వుందనీ, స్వీయ కవిత చదివిన ప్రతివారికీ శాలువా సత్కారం ఉంటుందనీ ప్రకటన ఇచ్చాంగా... దాని ఎఫెక్ట్!"

రాంరావ్ వారందర్నీ పలకరించి...

"భోంచేసి రండి!..." అని అటు డైవర్ట్ చేసాడు.

"మొదట కవితాపఠనం పెట్టాల్సింది. చివరిదాకా పెళ్లి అతిథులంతా ఉంటారో ఉండరో!"

"కచ్చితంగా ఉంటారు. వారికి భోజనాలు ఆఖర్లో పెడతాం!"

పెళ్ళి సగం అయ్యాక ఒక పక్కగా కవితా పఠనం ఏర్పాటు చేసాడు.

ఒక్కొక్కరు వచ్చి కవిత వినిపించగానే శాలువా కప్పుతున్నాడు రాంరావ్.

పెళ్ళి పూర్తయింది.


కానీ కవిజనం మంత్రించినట్లు మాయమైపోయారు.

"ఇలా జరిగిందేమిటి గురూ?" బిక్కచచ్చిపోయాడు కుటుంబరావు.

"కవులు తమ కవిత చదవగానే వెళ్లిపోతారనీ, మిగతావారి కవితలు ఛస్తే వినరనీ నాకూ ఇప్పుడే బోధపడింది!" ఈసారి రాంరావ్ ఏడ్చేసాడు.

ఇద్దరూ ఏడుపు ముఖాలతో కాబోయే అల్లుడు, కాదు కాదు అయిపోయిన అల్లుడి దగ్గరికి వెళ్లారు.

"మావాడు గేటు దగ్గర నిలబడి లెక్కవేసాడు. మొత్తం 509 మంది వచ్చారు... థాంక్స్ మామగారు." అన్నాడతడు మురిసిపోతూ ముసిముసిగా నవ్వుతూ.



# గొలుసు ధూమపానం

గంగాధర్ వడ్లమన్నాటి, 9908445969.



శ్రీగుదిబండి వెంకటరెడ్డిగారు నిర్వహించిన కథల పోటీలో బహుమతి పొందిన కథ

**"పెళ్ళిచూపులు చక్కగా జరిగాయిరా తమ్ముడూ!... అయితే వీడికి పిల్ల నచ్చిందో లేదో ఓ సారి అడుగుదూ!" అడిగింది లక్ష్మమ్మ గుసగుసగా.**

**"అమ్మో నా వల్ల కాదక్కా! కావాలంటే బావగారిని అడగమను!" చెప్పాడు గిరి ఆమె చెవిలో.**

**"చాల్లే, ఆయన నోరు తెరవడం పాపం, అన్నీ అపశకునపు మాటలే వస్తాయి... సరే నీకు తప్పినా తల్లిని నాకు తప్పదు కదా!" అని కొడుకు వైపు చూస్తూ**

"మధూ! అమ్మాయి బందరు లడ్డూలా చక్కగా ఉంది. పైగా తేనెపట్టు లాంటి ఆస్తి, లక్షణమైన గమ్మడి పాదులాంటి ఉమ్మడి కుటుంబం. అన్నిటికీ మించి ఆమెకు ఎంత భక్తి, శ్రద్ధా ఉన్నాయో తెలుసా? పూజగది చూపించి, పొద్దున ప్రసాదంగా చేసిన పరవాణ్ణం చేతిలో వేసింది... ఎంత బాగా చేసిందనీ, అసలు అలాంటి అమ్మాయిలు ఈ రోజుల్లో ఉన్నారంటావా?" అంటూ చెప్పుకుపోతోంది లక్ష్మమ్మ

తల్లి మాటలు ఓ వైపు వింటున్నా... ఎక్కడో ఆలోచిస్తున్నట్టు పరమ పరధ్యానంగా కూర్చున్నాడు మధు. కారు మరి కాస్త జోరుగా వెళ్ళడం ప్రారంభించింది.

అతని మావయ్య కూడా మధు వైపుకి తిరిగి– "అవున్రా! నాకు కూడా ఈ సంబంధం భలే నచ్చింది. వాళ్ళ పద్ధతులు ముద్దొచ్చాయ్, మర్యాదలు మనసుకు గుచ్చుకున్నాయ్. కనుక నువ్వు కళ్ళు మూసుకుని ఈ పెళ్ళికి సరే అని, ఆ అమ్మాయి మెళ్ళో నవ్వుతూ తుళ్ళుతూ ముళ్ళేసేయొచ్చు!" చెప్పాడు.

"అయితే, నువ్వు పెళ్ళికి ముందే ఆ సిగరెట్లు తాగే దిక్కుమాలిన అలవాటుని మాత్రం పూర్తిగా పాతరేయాలి రా!" చెప్పింది తల్లి.

ఆమె మాటలు విన్న మధు తండ్రి, ఆవదం తాగిన మొహం పెట్టి–

'సరిపోయింది పో! నీ కొడుక్కి ఆ వ్యసనం లేనిదే రోజు తెల్లవారదు



కదా!...మన ముందు అంటే తాగడు గానీ, దొరగారికి ఎప్పుడూ చేతిలో సిగరెట్టు కాలుతూ ఉండాల్సిందే. ఏదో నువ్వు ఈరోజు పిల్లను చూడడానికి వెళ్తున్నాం, అక్కడ అమ్మాయితో మాట్లాడాల్సి వస్తే సిగరెట్లు కాల్చిన వాసన అదీ వస్తే బాగోదూ కనుక పెళ్ళి చూపులు ముగిసే వరకు సిగరెట్ తాగొద్దని నువ్వు నీ పై ఒట్టు వేయించుకున్నావ్... కాబట్టే ఇలా ఉగ్గబట్టుకుని ఇప్పటి వరకు దొరగారు సిగరెట్ ముట్టలేదు పాపం! లేదంటే ఈ పాటికి పెట్టి సిగరెట్లు ఊది అవతల పడేసేవాడు... ఆ వదలగా వచ్చిన పొగతో మేఘాలు సృష్టించి, అందులో హాయిగా తేలిపోయేవాడు!" చెప్పాడు తండ్రి వ్యంగ్యంగా.

అతని మాటలకి తల్లి– "ఛ! అలా తొండిగా మాట్లాడక ఊరుకోండి. ఈ అమ్మ మాట మీద ఆ అమ్మాయిని చూశాడు... రేపు అమ్మాయి నచ్చితే... అమ్మ చెప్పినట్టు ఆ సిగరెట్ తాగడం పూర్తిగా మానేస్తాడు చూడండి... అమ్మంటే వాడికున్న ఇష్టం ముందు ఆ ముదనష్టం ఎంతా!...అయినా దేనికైనా ఓ సమయం రావాలి! అప్పుడు మీరే ముక్కున వేలేసు కుంటారు!" చెప్పిందామె నమ్మకంగా.

అప్పటి వరకూ అలా పరధ్యానంగా ఉన్న మధు, ఉన్నట్టుండి డ్రైవర్ భుజం తడుతూ–

"కొంచెం పక్కగా ఆపు, ఇందాకటి నుండీ చాలా దాహంగా ఉంది. ఓ కూల్ డ్రింక్ తాగి వస్తాను!" అన్నాడు.

కారు ఓ పక్కగా ఆగింది.


మధు చక చకా దిగి... బడ్డీ కొట్లోకి వెళ్ళి, "ఓ కూల్‌డ్రింక్ ఇవ్వండి!" అన్నాడు.

అతను మూత తీసి ఇచ్చిన కూల్ డ్రింక్ ని మూతి దగ్గర పెట్టుకుని, ఏదో ఆలోచిస్తూ బొమ్మలా నిలబడిపోయాడు.

అది చూసిన ఆ బడ్డీకొట్టతను, "అంత పరుగున వచ్చి కూల్ డ్రింక్ అడిగారు.తీరా ఇస్తే తాగరేటండీ?" అన్నాడతను ఆశ్చర్యంగా చూస్తూ

దాంతో కొంచెం తేరుకుని, సరే అని ఓ గుక్క తాగిన తర్వాత , కాస్త పక్కకు చూస్తూనే,

"ఏంటయ్యా ఇది! పబ్లిక్ ప్లేసులో సిగరెట్ తాగుతున్నావా? బుద్ధుందా నీకు?" అడిగాడు




పక్కన సిగరెట్ తాగుతున్న వ్యక్తిని ఉద్దేశించి.

"అయ్యో!... అయిపోయింది బాబు అయి పోయింది" అన్నాడతను, కంగారుగా సిగరెట్ చివరి దమ్ము మరికాస్త బలంగా లాగేస్తూ.

మధు కోపంతో అతని చేతిలోని సిగరెట్ తీసుకుని దూరంగా విసిరేసాడు.

ఆ దశ్యం చూసిన కార్‌లో కూర్చున్న తల్లి,

"ఏవండీ! మీ చెవులతో విన్నారా వాడేం అన్నాడో? కళ్ళతో చూసారా వాడేం చేసాడో?! వస పోసి పెంచిన దాన్ని, వాడి మనసేవిటో నాకు తెలుసండీ" అంటూ ఉబ్బితబ్బిబ్బై పోయిందామె.

ఆ దృశ్యం చూసిన తండ్రి కూడా ఓ క్షణం కొయ్యబొమ్మలా చూస్తూ– "నేను అదే చూస్తు న్నాను. వీడికి చిన్నప్పుడు సైకిల్ తొక్కడం నేర్పించిన వాడ్ని, కానీ వీడి సైకాలజీ మాత్రం ఇప్పటికీ నాకర్థం కావడం లేదు... ఏదో ఇన్‌స్టెంట్ కాఫీ లాగా, వీడిలో ఈ ఇన్‌స్టెంట్ మార్పేవిటీ! నాకు మింగుడు పడ్డం లేదు!" అని పక్కనున్న వాటర్ బోటల్ తీసుకుని రెండు గుక్కలు తాగి మళ్ళీ దీర్ఘంగా చూస్తూ–

"అబ్బే! ఇప్పుడు కూడా మింగుడు పడ్డం లేదు. వీడు అతన్ని అలా అనడం చూశాక, ఓ పక్క మానేసినట్టే అనిపిస్తున్నా, మరో పక్క మసిపూసి మారేడుకాయ చేస్తున్నాడేమో అనే అనుమానం కూడా కలుగుతోంది!" చెప్పాడు అయోమయంగా.

"సర్లేండి! మీకన్నీ అనుమానాలే... కని పెంచిన దాన్ని, కళ్ళ ముందు కనిపించింది చూపించి మరీ చెబుతుంటే అలా శంకించి అపశకునాలు పలుకుతారేం?..." అంది నెత్తిన గట్టిగా మొట్టేస్తూ.

"అమ్మోయ్!" అని తల రుద్దుకుంటూ...

"అవును! నువ్వంటే నాకూ అదే అనిపి స్తోంది. వాడు సిగరెట్ మానేసే ఉండొచ్చు." చెప్పాడు కాస్త దూరంగా జరుగుతూ...

ఊరు చేరాక... కారు దిగిన మధు వాళ్ళ మావయ్య కాస్త దగ్గరగా వచ్చి... "సూపర్ రా మధూ! నాకు ఇవాళ చాలా సంతోషంగా ఉంది!" చెప్పాడు.

"దేనికి మావయ్యా?" అడిగాడు కాస్త ఆశ్చ ర్యంగా చూస్తూ.

"దేనికేవిట్రా! నువ్వు మొత్తానికి మీ అమ్మ మాట విని, సిగరెట్ తాగడం మానేసావు. అదే పదిహేనువేలు!..." చెప్పాడాయన భుజం తడుతూ.

"మానేయడమా పాడా! పొద్దుటి నుండి సిగరెట్ లేక నాలుక పీకి చచ్చిపోతుంటే... రోడ్డు పక్క బడ్డీ దగ్గర ఒకడు, బొగ్గింజన్ లాగా పొగ వదుల్తూ మరీ సిగరెట్ కాల్చేస్తున్నాడు. మెరుపులా వచ్చిన ఆలోచనతో, వెంటనే కారు ఆపమన్నాను. దిగి కూల్ డ్రింక్ చెప్పి, వాడు సిగరెట్ తాగి వదులుతున్న పొగని మొత్తం హాయిగా పీల్చి వదులుతూ పాసివ్ స్మోకింగ్ చేసాను... తరువాత చివర్లో వాడు కాల్చిన సిగరెట్ తీసుకుని... దానిని పడేసే ముందు నలిపి... నా చేతిని కరువుతీరా వాసన చూశాను. దాంతో నా మనసు కుదుట పడింది! అదీ జరిగింది!" చెప్పడంతో వాళ్ళ మావయ్య కళ్ళు తేలేశాడు.

# ఇరుగూ పొరుగూ అన్నాక....

కోనే నాగ వెంకట ఆంజనేయులు, 9290660220



శ్రీగుదిబండి వెంకటరెడ్డిగారు నిర్వహించిన కథల పోటీలో బహుమతి పొందిన కథ

**ఉదయం నిద్రలోంచి మెలకువ రాగానే–పెరటి గోడ దగ్గర నుంచి మా ఆవిడ పెడుతున్న గావు కేకలు మిన్ను ముడుతూ వినిపిస్తున్నాయి... అసలు ఆవిడ పెడుతున్న కేకలకే నాకు మెలకువ వచ్చేసినట్టుంది. దాంతో నేను గాబరా పడిపోయి దుప్పటి తన్నేసుకుని కిందా మీదా పడిపోతూ అవిణ్ణి రక్షించడానికి పెరట్లోకి పరుగు పెట్టేనని ఊహించుకుంటే మీకు మా ఆవిడ గురించి అసలేమీ తెలియదనేగా!**

మరింకేంటి అంటున్నారు కదూ?


ఏముందీ? షరా మామూలే! మా పక్కింటి పరమేశ్వరితో పొద్దున్నే పోట్లాట. ఆ సమయంలో ఆవిడ పెరట్లో లేకపోయినా మా హేమ మాటల తూటాలు వాళ్ళింట్లో ఎక్కడ ఉన్నా అవిణ్ణి వెతుక్కుంటూ వెళ్లిపోతాయి.

"ఏంటి హేమా! యింత పొద్దున్నే ఆ కేకలు? ఎవరి మీదా?" బద్ధకంగా లేస్తూ అడిగేను... నాకు తెలియనట్టు అబద్ధంగా.

"ఇంకెవరూ? మన పక్కింటి పరమేశ్వరి మీదే. చూడండీ ఆవిడ గడుసుతనం? నిన్న సాయంత్రం మనం ఇద్దరం జంటగా చూశాం కదా – ఆ దక్షిణం కొమ్మ మీద ఒకే సైజు దోర జామకాయలు రెండు జంటలు. ఇప్పుడు చూస్తే ఒక జంటే ఉంది... ఎంత తెంపరితనం కాకపోతే పొద్దున్నే లేచి తెంపేస్తుందా మహాతల్లి? అదేమని అడిగితే 'మీ జామ జంట సంగతి మాకేం తెలుసు వంకాయ్ పులుసు' అంటూ ఆ పెడసరం సమాధానం ఒకటి!" ఈసడించి పారేసింది మా హోమ్ మినిస్టర్ హేమ.

"ఎందుకే ఎప్పుడూ ఆవిడతో గొడవలు?" అని ఎప్పుడైనా సముదాయించబోతే– "ఆ ... ఇరుగూ పొరుగూ అన్నాక ఆ మాత్రం గొడవలు రావా ఏంటి? ఎప్పుడూ పోట్లాడుకోని ఇరుగూ పొరుగుని చూపించండి ఎక్కడైనా?... వెయ్యి రూపాయలిస్తాను మీకు!" అంటూ దబ్బాశ చూపించి నా నోరు మూయించేస్తుంటుంది.

రెండు మూడు రోజులకోసారి మా పక్కింటావిడతో మా ఆవిడ పోట్లాట... లేదా మా ఆవిడతో మా పక్కింటావిడ జగడం... నాకు మామూలే కావడంతో



యింకేం మాట్లాడకుండా నిశ్శబ్దంగా నా పనుల్లో నేను మునిగిపోయాను.

మా పెరట్లోని జామ చెట్టు కొమ్మలు కొన్ని వాళ్ళ పెరట్లో జొరబడినట్లుగానే... వాళ్ళ పెరట్లోని కొన్ని మామిడి కొమ్మలు మా పెరట్లో విస్తరించి పోవడంతోనే ఈ గొడవలు మొదలైనట్లు నాకు అనుమానం.

మా పెరట్లోకి చొచ్చుకు వచ్చిన మామిడి కొమ్మలు నాకు మొదట్లో కొంత ఆనందాన్ని కలిగించాయి. పైగా నాకు కొంత శ్రమనీ తగ్గించాయి. కారణం – పండగలకీ, పబ్బాలకీ గుమ్మాలకు తోరణాలు కట్టడానికి మామిడాకుల కోసం చెట్లు, పుట్టలు పట్టుకు తిరిగే బాధ నుండి నాకు విముక్తి దొరకడమే అని మీరు గ్రహించే ఉంటారు లెండి ఈ పాటికి.

ప్రతీ పేరంటానికీ, శుభకార్యానికీ పక్కింటి వాళ్ళ మామిడి కొమ్మ మా పెరట్లో మళ్లీ మళ్లీ పూస్తూనే ఉంటుంది. నేను బల్లెక్కి ఆకులు కోస్తూనే ఉంటాను.

ఓ సారి మా పెరట్లోకి చొచ్చుకు వచ్చిన పక్కింటి వాళ్ళ మామిడి చెట్టు పచ్చి కాయలు పుల్ల పుల్లగా నోరూరిస్తూ చేతికి అందేస్తుంటే మా ఆవిడ నిశ్శబ్దంగా ఓ నాలుగు కాయలు కోసి టెంకలతో సహా ఊరగాయ పచ్చడి పెట్టేసి జాడీ మూత బిగించేసి ఆటకెక్కించేసింది... ఆవ ఘాటు పక్కింట్లోకి జొరబడకుండా.

'అన్ని కాయల్లో ఓ నాలుగు కాయలు కొస్తే ఆవిడకు తెలిసి చస్తుందా ఏం' అన్న మా ఆవిడ హేమలత ఊహాగానం తప్పని ఆ మరునాటి ఉదయమే తెలిసి పోయింది.

ఆ రోజు ఉదయాన్నే పెరటి గోడ అవతల నుండి సుప్రభాతం మొదలై పోయి నాకు మెలకువ వచ్చేసింది... ఆ రోజు పొట్లాట డ్యూటీ పరమేశ్వరిది కాబోలు.

'గుమ్మడి కాయంత నాలుగు మామిడి కాయలు కోసేశారండోయ్... ఆ మాత్రం కాయలు కొనుక్కోవడానికి గతి లేని వాళ్ళకి మా కాయలే కావలసొచ్చాయా?... మీ పచ్చడి బూజు పట్టిపోను, మీ జాడీలో వర్షం పడా... ఇలాంటి దొంగ మేళాల పక్కింట్లో ఉంటున్నందుకు మా చెప్పుతో మేమే కొట్టుకోవా'లంటూ చెంపలు వాయించుకుంటూ... రాద్ధాంతం చేసేసిందా పరమేశ్వరి పిల్లి మీదా ఎలక మీదా నేరం ఆరోపిస్తూ. మధ్యలో మేమేం చేశాం అని చిన్నబుచ్చుకున్నాయి మా రెండిళ్ల మధ్య పెరటి గోడ మీది పిల్లి, గోడ కింది కన్నంలోని ఎలకానూ.

మా ఆవిడ కిక్కురు మనలేదు సరి కదా ఆ రోజంతా పెరట్లో ఎంత పని ఉన్నా, పెరట్లో ఆరేసిన బట్టలు వర్షానికి తడిసిపోతున్నా సరే అటువైపు తొంగి చూడనైనా చూడలేదు దొరికి పోయిన దొంగలా.


ఆ పరమేశ్వరి... రోజూ ఉదయం లేచిన వెంటనే మా వైపు వాలిన వాళ్ళ మామిడి కొమ్మల్లో ఎన్ని కాయలున్నాయో లెక్కపెట్టుకుంటుందన్న విషయం అంత తెలివి తేటలున్న మా ఆవిడ కనిపెట్టలేకపోవడం నాకు ఆశ్చర్యం కలిగించిన మాట నిజం.


అందుకే అప్పటి నుంచీ మా ఆవిడ కూడా వాళ్ల వైపు దూసుకుపోయిన కొమ్మలకు కాసిన జామకాయలకు లిస్ట్ రాయడం మొదలు పెట్టింది ఓ చిత్తు నోట్‌బుక్ తయారు చేసుకుని. కాసిన కాయల లిస్ట్‌లోంచి కోసిన కాయలు మైనస్ చెయ్యడం – వాటికి కొత్తగా కాసిన కాయలు ప్లస్ చెయ్యడం... యిలా ఓ చిట్టా ఆవర్జా తయారు చేస్తోంది.

ఏనాడు ఈ లెక్కల్లో తేడా వచ్చినా మా రెండిళ్ల మధ్య గోడ బీటలు వారేది.

## దెయ్యాల గోల

-ఎన్.వి.ఎస్.రావు



ఇలా ఉండగా...ఓ సారి మా యింట్లో ఏదో వ్రతమో, పూజో చేసుకుంటూ చుట్టుపక్కల వాళ్ళతో పాటు మా పక్కింటి పరమేశ్వరికి కూడా బొట్టు పెట్టి తప్పకుండా రమ్మని మరీ మరీ పిలిచింది మా ఆవిడ హేమ.

మా హేమ పిలుపును మన్నించి పూజకు వచ్చిందా పరమేశ్వరి.

వస్తూ వస్తూ వాళ్ళ పెరట్లో పండిన పెద్ద సైజు తీయని మామిడి పళ్ళు ఓ అరడజను పట్టుకువచ్చి మా ఆవిడ చేతిలో ఉంచింది ఆప్యాయంగా.

దాంతో పొంగి పొర్లి పోయింది మా హేమావిడ. వ్రతం అయిపోయిన తరువాత ఆవిడ వెళ్లిపోయేట ప్పుడు ప్రసాదంతో పాటు... పది దోర జామపళ్ళు ఫ్రిజ్ లోంచి తీసి ఓ కవర్లో వేసి యిస్తూ–

"అన్నయ్య గారికి పెట్టి మీరూ రుచి చూడండి వదినా గొప్ప రుచిగా ఉన్నాయి!" అభిమానం వలక పోస్తూ అంది మా హేమ.

నా ఆశ్చర్యం నషాళానికి ఎక్కింది.

"యిదేమిటే! రోజూ తిట్టుకుంటూ కొట్టుకున్నంత పని చేస్తారు కదా ఆ పెరటి గోడ దగ్గర... ఈ రోజు యిలా కలిసిపోయారేంటీ?" ఆశ్చర్యంగా అడిగితే–

"ఇరుగు పొరుగూ అన్నాక ఆ మాత్రం యిచ్చి పుచ్చుకోవడాలు ఉండవా ఏంటి?..." అంటూ క్లాస్ పీకింది.

హమ్మయ్యా! యింక ఈ వదినా మరదళ్ల మధ్య ఏ గొడవలూ, తగవులూ ఉండవనీ, తెల్లారే నాకు నిద్రాభంగం కాదని సంతోషిస్తూ ఆ రాత్రి హాయిగా నిద్రపోయాను.


'రెండు రోజుల తరువాత' – అని రాసి ఉన్న ఓ ప్ల కార్డు మా రెండిళ్ల పెరటి గోడ ఈ చివరి నుంచి ఆ చివరికి నడిచి వెళ్ళింది టీవీలో జబర్దస్త్ ప్రోగ్రాంలో లాగా!

నేను తెల్లవారు ఝామున నిద్ర లేచేసరికి పెరటి గోడ దగ్గర మా హేమావిడ పక్కింటి పరమేశ్వరి వదిన గారి మీద పెడుతున్న పెద్ద పెద్ద కేకలు నా చెవిని సోకేయి.

అసలు మా ఆవిడ పెడుతున్న కేకలకే నాకు మెలకువ వచ్చేసిందని ఎప్పట్లాగే అర్థమై పోయింది నాకు.

మా జామ చిట్టా ఆవర్జా లెక్కల్లో ఎక్కడో తేడా కొట్టిందని ఊహించిన నేను కామ్‌గా నా పనుల్లో మునిగిపోయాను.

## దొంగ మనసు









# గుండెల్లో గులకరాయి.

గంటి ఉషాబాల, 8019261852



శ్రీగుదిబండి వెంకటరెడ్డిగారు నిర్వహించిన
కథల పోటీలో బహుమతి పొందిన కథ

**ఆరోజు కళ్యాణి కన్వెన్షన్ హాల్లో వధూవరుల స్వయంవరం ఏర్పాటు చేశారు 'ఆకన' టీవీ వారు. అంటే అది 'అర్ధేచ, కామేచా, నాతిచరామి'– వీటికి షార్ట్ కట్‌గా ఆ టీవీ ఛానల్ వారు అలా పేరు పెట్టుకున్నారు. పాపం పెళ్లిళ్ల పేరయ్యల సేవలు అన్నిటిని టీవీ ఛానల్ వారే అందిస్తారన్నమాట. వెయ్యి అబద్ధాలు ఆడి అయినా ఓ పెళ్లి చేయాలన్నది వాళ్ళ పాలసీ.**

ఆ రోజు స్వయంవరానికి పెళ్ళికొడుకులు పెళ్ళికూతుళ్ళూ, వాళ్ల వాళ్ల తల్లిదండ్రులతో హాలంతా కిటకిటలాడుతోంది. వచ్చినవాళ్ళల్లో సామాన్యులతో పాటు చోటామోటా సెలబ్రెటీలు, అంటే చిన్నాచితక టీవీ యాంకర్లు, యూట్యూబర్లు వగైరాలు కూడా ఉన్నారు. ఒక్కొక్కరిని స్టేజి మీదకు పిలిచి పరిచయం చేస్తోంది యాంకరమ్మ.

పరిచయాలు అవగానే ఇరువర్గాల వారు వారి వారి వివరాలు పంచుకుంటూ గందరగోళంగా ఉంది అక్కడ.

ఇంతలో– "మిస్టర్ శైలేష్!... 'విందు పసందు' యూట్యూబ్ ఛానల్ స్టార్ అంటూ పిలిచింది యాంకర్. లక్షల మంది సబ్స్క్రైబర్లు ఉన్న శైలేష్ ఈసారైనా మ్యాచ్ కుదుర్చుకోవాలనే పట్టుదలతో బట్ట బుర్రను దువ్వెనతో దువ్వి అందరికీ చేయూపుతూ నిలబడి తన వివరాలు రిజిస్టర్ చేసుకోసాగాడు.

ఇంతలో– "మిస్ ప్రేమ! 'వియ్యాల వారి విందు' ఛానల్ ఫేమ్" అంటూ పిలిచింది యాంకరమ్మ.



ఆసక్తిగా చూశాడు శైలేష్ వెతకబోయిన బచ్చలితీగ కాలికి తగిలినట్టు ఫీల్ అయ్యాడు.

స్వతహాగా అతడుమంచి భోజనప్రియుడు. వంటల మీద ఇష్టంతో యూట్యూబ్ ఛానల్ పెట్టి రోజు బోలెడన్ని టేస్టీ టేస్టీ వంటల్ని పోస్ట్ చేస్తూ ఉంటాడు.

ప్రేమ కూడా అదే లైన్‌లో ఉండడంతో శైలిష్‌కి పిచ్చిపిచ్చిగా నచ్చేసింది. తను పెట్టే కుక్కరి ఐటమ్స్ కూడా ఎంతో నోరూరించేలా ఉంటుంది... పైగా ఆమె ఛానల్‌కి శైలేష్ సబ్‌స్క్రైబర్ కూడా.

వంట చేసి పెట్టే భార్య దొరకడం ఈ రోజుల్లో 'సద్దన్నంలో ఆవకాయ' కలుపుకొని తిన్నంత అదృష్టం అనుకుంటూ ప్రేమకు ఓకే చెప్పేసాడు.


అటు ప్రేమకి శైలేష్ బాగా నచ్చేసాడు వంట వచ్చిన మొగుడు ఉంటే జీవితమే పూర్ణం బూరెలో నెయ్యి వేసుకుని తిన్నంత మధురం కాదా అనుకుంటూ ఊహల్లో తేలిపోసాగింది.

ప్రేమ శైలేష్ల పెళ్లి అంగరంగ వైభోగంగా బోలెడుమంది సబ్‌స్క్రైబర్‌లు, వ్యూయర్స్, మధ్య జరిగింది.

ఇద్దరూ పీచు మిఠాయి, జీళ్ళు, కొబ్బరి ఉండల్ని తలుచుకుంటూ గదిలో కదుగెట్టారు. మొదటగా ఏం మాట్లాడాలో అర్థం కాక ప్రేమ–

"మీ పేరు భలే ఉంది శైలేష్!" అంది.

"అబ్బే!... అది మా తాత గారి పేరు!..."




అన్నాడు సిగ్గుపడుతూ.

"అబ్బో!... మీ తాత గారి పేరే ఇంత మోడ్రనా!" కిసుక్కున నవ్వింది ప్రేమ.

"అయ్యో! ఆయనేం మోడ్రన్ కాదండి... ఆయన అసలు పేరు కొండయ్య. అర్థం చెడ కుండా నాన్న నాకు శైలేష్ అని పెట్టారు. మీ పేరు కూడా భలే బాగుంది ప్రేమా!" అన్నాడు నోట్లో పిప్పరమెంటు చప్పరిస్తున్నట్టుగా.

"సేమ్ టు సేమ్! ఇది మా అమ్మమ్మ పేరు పేరమ్మ. గ్రామర్ చెడకుండా నాన్న అలా పెట్టారు అన్నమాట. నిమ్మ బిళ్ళ పళ్ళ కింద పరపరా నవులుతున్నట్టుగా చెప్పింది ప్రేమ.

"నువ్వు మొన్న పోస్ట్ చేసిన వీడియో గుజరాతి డోక్లా వంటకం ఎంత బాగుందో... చూస్తుంటే నోరూరింది నాకు! ఎప్పుడు చేసి పెడతావు?" ప్రేమగా అడిగాడు శైలేష్.

గతుక్కుమంది ప్రేమ.

మెల్లిగా సర్దుకుని– "ముందు ఇది చెప్పండి మొన్న మీరు పోస్ట్ చేసిన కొబ్బరి బొబ్బట్టు వీడియోలో బొబ్బట్లు పొరలు పొరలుగా భలే ఉన్నాయి. నాకు ఎప్పుడు రుచి చూపిస్తారు?" ఆశగా అడిగింది

గతుక్కుమడం శైలేష్ వంతయింది.

ఇంక నీళ్లు నమలకుండా పాలు తాగడమే బెస్ట్ అని– "నీకో విషయం చెప్పాలి!" అన్నాడు.

"మరి నేనూ నీకో విషయం చెప్పాలి!" అంది ప్రేమ.

"సరే లేడీస్ ఫస్ట్ అంటారు కదా ఈ పూతరేకులు తింటూ చెప్పు!" అన్నాడు


ఆముదం సిప్ చేస్తూ మొహం పెట్టి ప్రేమ–

"మరేమో నాకు అసలు వంట రాదు... తినడం అంటే మాత్రం చాలా ఇష్టం ఆ ఇష్టం తోనే ఓ చానల్‌ని పెట్టి... మా కజిన్ చేత వంటలు చేయించి వీడియో పెడతాను.... వాయిస్ ఓవర్ మాత్రం నాదే సుమా!..." నాంచుతూ చెప్పింది.

ఉలిక్కిపడ్డాడు శైలేష్.

పచ్చిమిరప పాయసం తిన్నట్టు మొహం పెట్టి– "నాదీ అదే స్టోరీ! వంట చేసేది నా ఫ్రెండ్! గొంతు మాత్రం నాదే!" అన్నాడు.

అంతే! ఇద్దరు గుండెల్లో గులకరాళ్లు యమా స్పీడ్‌గా పడ్డాయి పాపం.




# బాచి అవార్డు -2022 పురస్కారం మరియు శ్రీసోమయాజుల శివరామయ్య, హైమవతి స్మారక కార్టూన్ల పోటీ విజేతలకు బహుమతి ప్రదానోత్సవం!













**హా**స్యానందం సౌజన్యంతో ప్రముఖ కార్టూనిస్టు శ్రీ బాచి గారు వారి అమ్మగారు శ్రీమతి అన్నం బాచిగారి పేరు మీద నిర్వహించిన కార్టూన్ల పోటీ మరియు కార్టూన్ ఇష్టులు శ్రీ ఎస్.వి. రమణగారు వారి తల్లిదండ్రులు శ్రీసోమయాజుల శివరామయ్య, హైమవతి వార్ల స్మారకంగా నిర్వహించిన కార్టూన్ పోటీలో గెలుపొందిన కార్టూనిస్టు లకు బహుమతి ప్రదానోత్సవం ఆగస్టు 15 విజయవాడలో బాలోత్సవ భవన్లో సాయంత్రం 6 గంటలకు జరిగింది.

దూర ప్రాంతాల నుంచి కార్టూనిస్టులు ఈ సభలో ఉత్సాహంగా పాల్గొన్నారు.

విజయవాడలోని ప్రముఖ ఆర్థోపెడిక్ వైద్యులు శ్రీధర్ గారు ముఖ్య అతిధిగా విచ్చేసిన ఈ సభలో ప్రముఖ కార్టూనిస్టు శ్రీ కామేష్, పోటీ నిర్వాహకులు ప్రముఖ కార్టూనిస్టు శ్రీ బాచిగారు, శ్రీ ఎస్.వి.రమణగారు వేదిక మీద పాల్గొన్నారు.

కార్టూన్ పోటీలో బహుమతి పొందిన కార్టూనిస్టులతో పాటు ప్రముఖ కార్టూనిస్టు శ్రీభగవాన్ గారికి సత్కారం చేశారు.

ముఖ్య అతిథి డాక్టర్ శ్రీధర్ గారు మాట్లాడుతూ– "కార్టూనిస్టులకి, కార్టూన్లకి తగ్గుతున్న ప్రాముఖ్యతని పెంచడానికి అందరూ తగిన విధంగా ప్రయత్నించాలని హాస్పిటల్స్ లాంటి వాటిల్లో కార్టూన్ ప్రదర్శన మొదలు పెట్టాల"ని అభిప్రాయపడ్డారు.

బాచిగారు మాట్లాడుతూ "ఈసారి పోటీలకు చాలా నాణ్యత కలిగిన కార్టూన్‌లు వచ్చాయని బహుమతుల ఎంపికకి చాలా కష్టపడాల్సి వచ్చిందని" తెలిపారు.

శ్రీఎస్.వి.రమణగారు– "ఈ బహుమతి ప్రధానోత్సవం వచ్చే సంవత్సరం తెనాలిలో నిర్వహిస్తామ"ని ప్రకటించారు.

హాస్యానందం ఎడిటర్–శ్రీ పి.రాము, ప్రముఖ కార్టూనిస్ట్ శ్రీ కామేష్ గారు, ఈ పోటీలకు న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు

డా॥కప్పగంతు రామకృష్ణ గారు సభను ఆద్యాంతం ఆహ్లాదంగా నిర్వహించారు. నిర్వాహకులు డా॥ కప్పగంతు రామకృష్ణ గారిని కృతజ్ఞతపూర్వకంగా సత్కరించారు.

కార్యక్రమం చివరిలో జరిగిన చక్కటి విందులో కార్టూన్ లిస్టులు కార్టూన్ లిస్టులు పాల్గొని కార్యక్రమాన్ని ఆనందంగా ముగించారు.

**–నాగిశెట్టి**

# లావొక్కింతయు లేదు

ఓట్ర ప్రకాష్ రావు, 09787446026



శ్రీగుదిబండి వెంకటరెడ్డిగారు నిర్వహించిన కథల పోటీలో బహుమతి పొందిన కథ

**"అవ్వా! రండ... రండ... (రండి రండి) లెస్సగా వుండారా?" అంటూ ఆహ్వానిస్తున్న పంకజంను చూడగానే బామ్మ కోపం పెట్రోల్ ధరలా కోపం పైకెగిసింది.**

**పక్కనే వున్న సుబ్బారావును చూస్తూ "ఏరా సుబ్బిగా! నువ్వు పంకజంతో కాపురం చేస్తున్నావా లేదా?" కోపంగా అడిగింది.**

"అదేంటి బామ్మా !అలా అడిగావు?!" అంటూ బామ్మ వైపు బిత్తర చూపులు చూడసాగాడు


"నీ పెండ్లాం మాటలు వింటూంటే కడుపులో కలపెట్టినట్లుంది. రండ రండ అన్న మాటలతో నా తలపై పెద్ద బండ వేసినట్లనిపించింది. నాలుగేళ్ల కాపురంలో నీలా చక్కగా తెలుగు మాట్లాడుతుందనుకొంటే ఇలా మాట్లాడుతోందేమిటి?"

"బామ్మా! మేము తమిళనాడులో ఉండటం వలన ఇక్కడి తెలుగే పంకజంకు అలవాటై పూడ్చింది (పోయింది)" అంటూ నాలుక కొరుక్కొని... "అలవాటై పోయింది!" అన్నాడు.

"హా హతవిధీ! నిన్నుకూడా మాతృభాష స్వచ్ఛంగా మాట్లాడనీయకుండా పూడ్చేసిందా?" అంటూ తల కొట్టుకొంది

"అవ్వా!... నాకు తెలుంగు లెస్సగా రాలేందని కోపంగా ఉండాదా?" అంటూ తలవంచుకొంది పంకజం.

"పది సంవత్సరాలు అమెరికాలోనే వున్నా... చెవుడు వలన ఎవరితో మాట్లాడలేకపోయాను. ఇప్పుడే ఆపరేషన్ చేసుకొని



ఇండియా వచ్చాను... రాగానే నా మనవడు సుబ్బారావు ఇంటికి వచ్చాను! నీవు తెలుగు సరిగ్గా మాట్లాడక పోవడం వలన కాస్తా బాధ కలిగింది."

"ఈడ (ఇక్కడ) అందరూదా ఇట్లదా మాటాడుతురు... ఇంక మీంద తెలుంగు బాగా నేర్సుకొంటా!" బాధపడుతూ అంది.

"నీవు ఇక్కడ ఉంటే నీకు స్వచ్ఛమైన తెలుగు రాదు. తెలుగు రాష్ట్రంలో వున్న మన సొంత ఊరిలో సుబ్బీ చెల్లెలు ఇంటికెళ్లి ఒక్క నెల ఉంటే చాలు చక్కగా మాట్లాడుతావు."

"ఆయనకు బైట కూడు (భోజనం) వొళ్ళుకు పడదవ్వా!" అన్న పంకజం మాటలు... ఈసారి బామ్మకు కోపానికి బదులు బాధను కలిగించింది.

"వాడికి నేను రుచిగా వంటచేసి పెడతాను. నీవు మన సొంత ఊరికెళ్తే స్వచ్ఛమైన తెలుగంటే ఏమిటో తెలుస్తుంది! ఆ తెలుగు బాగా నేర్చుకొనిరా! సుబ్బి చెల్లెలుకు నత్తి వలన సరిగా మాట్లాడలేకపోయినా వాళ్ళ పిల్లల దగ్గర తెలుగు నేర్చుకో! చెవి సమస్య వలన నేను ఫోన్‌లో మాట్లాడలేను. నీవు ఇక్కడకు వచ్చాక నీమాటలు చెవిలో తేనె పోసినట్లనిపించాలి."

తెలుగు రాష్ట్రంలోనున్న సుబ్బారావు చెల్లెలి ఊరికెళ్లి... నెల తరువాత తిరిగి వచ్చింది.


✦✦✦


"అవ్వా! ఆడ ఓరూ నాతో తెలుంగు మాటాడలేదు! పెద్ద కూంతురు తెలుంగు బదులు సంస్కృతం సదువుతోంది... చిన్న కూంతురు ఫ్రెంచ్ సదువుతాంది... ఆళ్ళకు తెలుంగు మాటాడే అలవాటు పూడ్చింది. నేను తెలుంగులో అడిగితే ఆళ్ళు ఫ్రెంచ్... సంస్కృతంలో బదులు సెప్తురు. నాకు సంస్కృతం, ఫ్రెంచ్ లెస్సగా చెప్పిస్తిరి. ఆ తెలుంగు యాడుందో (ఎక్కడుందో)?!" అంది.


"ఆ తెలుగు భాష నీలాంటి భాషాభిమానం కలవారు కాపాడగలరన్న నమ్మకంతో వుంది. గజేంద్ర మోక్షంలో ఆపదలో చిక్కుకున్న ఏనుగులా లావొక్కింతయులేదు అన్న పద్యంతో వేడుకొంటూ ఉంటుంది. మీరే తెలుగు భాషను కాపాడాలి!" అంది బామ్మ.

## ఇలా కాదేమో!

డి. శంకర్



# ఎగిరిపోతే ఎంత బాగుంటుంది

పద్మావతి తల్లోజు, 6300884717



శ్రీగుదిబండి వెంకటరెడ్డిగారు నిర్వహించిన కథల పోటీలో బహుమతి పొందిన కథ

**"అరె మామ! హ్యాపీ బర్త్ డే రా!... ఇంతకీ సాయంత్రం పార్టీ ఉందా? డ్రెస్ రెడీ చేసుకున్నావా?" ఆతృతగా అడిగాడు రాజు, తన బెస్ట్ ఫ్రెండ్ నరేష్‌ను.**


**"థాంక్యూ మచా!... డ్రెస్ గురించి ఎందుకులే... నాకు తానుంటే చాలు! అన్ని కాలాల్లో తన తోడే మేలు!!" పరవశంతో ప్రాసలు దొరకక అంతటితో ఆగిపోయాడు.**

"ఒరేయ్ ఏంట్రా ఇది! కొత్త గర్ల్ ఫ్రెండ్ గురించి కాదు కదా?!... అసలు వదినకి తెలుసా ఈ విషయం! చెప్పరా బాబు..!" నరేష్ కొంచెం గ్యాప్ ఇచ్చినా టెన్షన్తో చచ్చిపోయేలా ఉన్నాడు రాజు.

"అబ్బ! ఛా...నీకు అలా అర్థమైందా?... నేను లుంగీ గురించి మాట్లాడుతున్నా!... కొత్త లుంగీ కొన్నా! సాయంత్రం పార్టీ కి కూడా అదే!..." అంటూ గర్వంగా చెప్పాడు నరేష్.

"ఒరేయ్!... ఏమైందిరా అయ్యా నీకు! బర్త్‌డే రోజు ఇలా పిచ్చిపిచ్చిగా మాట్లాడుతున్నావ్? పిచ్చి కుక్క ఏం కరువలేదు కదా? ఏమైనా అనుకో తొక్కలో నీ లుంగీ పార్టీకి మాత్రం నేను చచ్చినా రాను!" అన్నాడు ఖరాఖండిగా రాజు.

"వెనుకంజ వేసే వారి కోసం నా విప్లవం ఆగదురా!... సాయంత్రం పార్టీలో లుంగీలోని సౌలభ్యాన్ని, దాని గొప్పతనాన్ని పదిమందికి చెప్పి... షార్ట్స్ కంటే లుంగీ మేలని వారి చేతే అనిపిస్తాను" అని విసురుగా ఫోన్ పెట్టేసాడు నరేష్.



'ఏళ్ళ నుండి ఎండ వేడికి అల్లాడి పోతుంటే, వీళ్ళేమైనా వచ్చి ఆదుకున్నారా? పిలవగానే నా జీవితంలోకి వచ్చి... చల్లదనం దొరికే మార్గం నాకు చూపించి... నా బతుకు మీద ఆశ కల్పించింది నువ్వు కాదు?...' అని అపురూపంగా ఒంటిపైన ఉన్న లుంగీని తడిమి చూసుకున్నాడు నరేష్.


ఇంతలో తలారా స్నానం చేసి, కొత్త బట్టలు వేసుకొని, దేవునికి దండం పెట్టుకొమ్మని భార్య రమణి ఆజ్ఞాపించాడం గుర్తొచ్చింది.

ముందు ఆ పని పూర్తి చేసి దేవుని దగ్గర పెట్టిన కొత్త లుంగీని అపురూపంగా కళ్ళకద్దుకుని కట్టుకోబోయాడు.

కానీ, తన లుంగీ లుంగీలా లేదు. రెండు కొనలు ఒక చోట చేర్చి కుట్టబడ్డాయి.

"ఏంటే ఇది? నీకేమైనా మతి పోయిందా? నిన్ను ఇలా ఎవరు కుట్టమన్నారు!?" అని అరిచాడు నరేష్ భార్యపైన.

"కాలనీవాళ్ళ క్షేమం కోరి... ఆ మాత్రం చేయక తప్పలేదు. అసలే మన ప్రహరి గోడ అంతంత మాత్రం. మెట్లమిద్దె అసలే లేదు. దాపు లేని చోట మీరు దాపరికం లేకుండా మేద పైన పడుకుంటే చూసేవాళ్ళకే కదా కష్టం! నిన్న ఉదయం ఎదురింటి బామ్మ గారు మేడపైన దేన్నో చూసి ఝూడుసుకొని, కోమాలోకి వెళ్లారట. నాకు మీ మీదే అనుమానం. అసలే మీకు పడుకుంటే ఒళ్ళు వాయి తెలియదు... లుంగీని, బ్లాంకెట్‌లా కప్పుకొని, ఉదయం అలాగే లేచిన సందర్భాలు ఎన్నో...




కనీసం మేడపైన పడుకునేటప్పుడయినా పైజామా వేసుకోండి... అని అరుస్తూనే ఉంటాను. ఆవిడకు ఏమైనా జరగాలి... ఆ హత్యాపాతకం ఊరికే పోదు..." అని శాపనార్థాలు మొదలు పెట్టింది.

"ఇక ఆపుతావా! పుట్టిన రోజు అని కూడా లేకుండా ఏంటి నీ సోది. ఇదిగో నా కొత్త లుంగీని ఎలా కుట్టావో... అలాగే విప్పి పెట్టు. సాయంత్రం ఫంక్షన్‌లో అదే కట్టుకోవాలి. పైన లుంగీలు ఆరేశాను... అసలే ఎండాకాలం! రంగు వెలిసిపోతాయి. వెళ్లి తీసుకు వస్తాను." అంటూ పాత లుంగీ కట్టుకుని, తమ ఇంటికి వెనుకవైపున మెట్లు హుషారుగా ఎక్కడం మొదలుపెట్టాడు నరేష్.

"ఎగిరిపోతే ఎంత బాగుంటుంది..." సాంగ్‌ను హమ్ చేసుకుంటూ... అలా పై మెట్టుకు చేరాడో లేదో! ఒక్కసారిగా ఈదురు గాలి వచ్చి నరేష్ లుంగీని అమాంతం లాగేసుకొని వెళ్ళిపోయింది. అండర్ వేర్, బనియన్‌తో అలాగే బిక్క చచ్చిపోయి మెట్లమీద ముడుచుకొని కూర్చుండిపోయాడు.


పోనీ, పై నుండి ఆరేసిన లుంగీ తెచ్చుకుందామంటే, అవి కూడా పర్లాంగు దూరంలో ఉండి చచ్చాయి. భార్యను గట్టిగా పిలుద్దామంటే, దారిన పోయేవాళ్లు పైకి చూస్తారేమోననే భయం! అయినా పిలిచి చూపించుకోవడం బాగుండదని మూసుకొని కూర్చున్నాడు. ఏమి చేయాలో పాలుపోక భార్య కోసం ఎదురు చూస్తూ ఎర్రటి ఎండలో కింద కాలిపోతున్నా, చెమటతో ఒళ్ళు ముద్దవుతున్నా... భరిస్తూ... మొదటిసారి "ఈ దరిద్రపు లుంగీ... నా ప్రాణం, మానం.. రెండూ తీసేసింది!..." అనుకుంటూ స్పృహ తప్పి పడిపోయాడు.

చల్లటి నీరు ముఖంపై పడగానే కళ్ళు తెరిచిన నరేష్ కు నీళ్లు తాగిస్తున్న భార్య రమణి కనిపించింది.

కట్టుకోమని లుంగీ ఇచ్చింది.

కోపంతో నరేష్ దానిని బయటికి విసిరి కొట్టి, పైజామా తెమ్మని భార్యను పురమాయించాడు.

"పరువు పోతే గాని బుద్ధి రాలేదు!" అని లోలోపల నవ్వుకొంటూ అక్కడి నుండి కదిలింది రమణి.



# పాళీ పదకేళీ విన్యాసం


తెలికిచెర్ల విజయలక్ష్మి, 9301421243


శ్రీగుదిబండి వెంకటరెడ్డిగారు నిర్వహించిన కథల పోటీలో బహుమతి పొందిన కథ

డ్యూటీలో, బిజీగా ఉండే కామేశం, రిటైర్ అయి పొద్దుగడవక అవస్థపడుతూ జీవితం వుప్పులేని పప్పులా నిరాసక్తిగా ఉందని వాపోయాడు.

కామేశం బాధ విన్న స్నేహితుడు– 'సాహితీ సేవ చెయ్యి' అంటూ సలహా ఇచ్చి చక్కా పోయేడు.

ఇదేదో బాగానే ఉన్నట్టనిపించి పెద్దబాల శిక్ష, నిఘంటువులు తెచ్చుకుని చదవటం మొదలుపెట్టేడు.






గ్రూప్ క్రియేట్ చేసి లింక్ పెట్టి గ్రూప్ లోకి అందర్నీ ఆహ్వానించేడు. అప్పుడు మొదలైంది కామేశం జీవితంలో బిజీ.

“చక్కగా రాస్తున్నావు తల్లీ!” కామేశం పొగడగానే, గ్రూప్ లో కవిత్వం రాస్తున్న మల్లీశ్వరి, మొల్లలా ఫీలవుతూ...

“బిరుదులిస్తారా ఆర్యా?” అంది.

“గ్రూప్‌లో చేరి సంవత్సరం అవ్వాలి. మరి ముగ్గుర్ని చేర్పించాలి... అప్పుడే బిరుదులు!” అంటూ ఫోన్ పెట్టేసిన కామేశం...

‘వీళ్ళు రాసినవి చదవడమే గొప్పనుకుంటే... ఇంక బిరుదులు ఇవ్వాలిట!’ అనుకుంటూ లేవబోతున్నవాడల్లా ఫోన్ రింగవటంతో, స్క్రీన్ మీద నంబర్ చూసి...

‘అమ్మో! సందేహాల సుందరి ఫోన్ చేస్తోంది. ప్రశ్నల వర్షం కురిపిస్తుందని భయపడుతూ...

“చెప్పమ్మా! సునందా...” అన్నాడు.

“నాకొక సందేహం ఆర్యా?”

“అడుగు తల్లీ!”

“రమ్యగారి కవితకు అక్షరసాంద్రత అంటూ సమీక్షించారు. అర్థంకాలేదు సర్!”

“సాంద్రత, అంటే బరువు కొలవటానికి సైన్స్‌లో వాడే పదం... అక్షరాలకు అందమొస్తుందని అలా పెట్టేను!”

“మరొక సందేహం ఆర్యా?”

“సెలవియ్యి తల్లీ!”

“కవితాత్మకత, అని ఎక్కడో చదివేను. కవితలకు ఆత్మలుంటాయా?” అంటూ ప్రశ్నిస్తున్న సునంద మాటలు చెవిలో మ్రోగుతుంటే... ‘నీ ప్రశ్నలకు జవాబు చెప్పలేక నేనే ప్రేతాత్మగా మారతానేమో తల్లీ’ అనుకుంటూ...


“ఇంకా ఏమైనా ప్రశ్నలు ఉంటే అన్నీ అడిగెయ్యమ్మా!” అన్నాడు చిరాకుగా.

“పదాల భావ గాంభీర్యం’ అన్నారు. పదాలకు గంభీరం ఉంటుందా? సరితగారి కవితను సమీక్షిస్తూ ‘పదాలు పరిమళ సుగంధ భరితం’ అన్నారు, అదీ అర్థంకాలేదు సర్!”

“నువ్వు ఇంగ్లీష్ మీడియం చదువుకున్నావు. తెలుగుభాషలో కమ్మదనం నీకు తెలియదు. మంచి తెలుగు పుస్తకాలు చదువు. నీకర్థమౌతాయి!” అంటున్న కామేశంతో...

“ఆర్యా... మీ కవితనెవరో సమీక్షిస్తూ ‘పాలీ పదకేళీ విన్యాసం’ అన్నారు. అదేంటో మరి?” అంటూ సునంద వేసిన ప్రశ్నకు కామేశం తలతిరుగుతుంటే...

“తల్లీ! నీ తింగర ప్రశ్నలకు సమాధానమెలా చెప్పాలో తెలియక నా శరీరంలో ఉండే సిరలు, ధమనులు నాట్యమాడుతున్నాయి” అని చిరాకుగా ఫోన్ పెట్టేసి... ‘ఈవిడగారి ప్రశ్నలకు జవాబు చెప్పలేక బుర్రపీక్కునే బదులు... భార్యతో పాటూ కూర్చుని టీవీ సీరియల్స్ చూడటం ఉత్తమం’ అనుకుని గ్రూప్ మూసేసాడు కామేశం.



# భలే మంచి చౌక బేరము

కోటమర్తి రాధా హిమబిందు, 7780188651



శ్రీగుదిబండి వెంకటరెడ్డిగారు నిర్వహించిన కథల పోటీలో బహుమతి పొందిన కథ

**రాత్రి ప్రయాణం చేసి పొద్దున్నే రైలు దిగాడు సోమేశ్వరరావు.**

**స్కూల్ పిల్లవాడు మోయలేని పుస్తకాలు మోస్తున్నట్లు రెండు భుజాలకు కలిపి పెద్ద బ్యాగు.. చేతిలో నిండుగా ఉన్న రెండు షాపర్లతో అవస్థపడుతూ ముందుకు నడిచాడు.**

కూలీ అంటూ ఎదురైన వాళ్ళను వద్దంటూ తల అడ్డంగా వూపుతూ గబ గబ ముందుకు నడిచాడు.

ఏదో పళ్ళ బిగువున నడిచాడే కానీ... చాలా కష్టంగానే ఉంది. రైల్వేస్టేషన్ దాటి కొంత దూరం నడిచేసరికి ఆయాసం వచ్చింది.

పిలవకుండానే ఆటో వచ్చి ప్రక్కన ఆగింది.

వెళ్లాల్సిన అడ్రస్ చెప్పాడు.

ఆటో అతను రెండువందలు అడిగాడు.

"రైలు చార్జీ రెండువందలు పెట్టు కొని ఇక్కడ దిగాను... ఇక్కడ కొద్ది కిలోమీటర్లు వెళ్ళటానికి రెండు వందలా? ఎంతకని దోచుకుంటా రయ్యా మీ ఆటోవాళ్లు?" అంటూ నిలదీశాడు.

ఆటో అతను ఎప్పుడైనా ఆటో ఎక్కావా? అన్నట్లు ఒకచూపు చూసి నిర్లక్ష్యంగా వెళ్ళిపోయాడు.

అలాగే మూడు నాలుగు ఆటోలు ఆగటం.. సోమేశ్వరరావు కొన్ని



ఆపటం జరిగాయి కానీ బేరం కుదరలేదు.

విసుగొచ్చిన సోమేశ్వరరావు రోడ్డు దాటి ఎదురు సందులోకి నడిచాడు.

బట్టల వ్యాపార ప్రకటనతో ఆటో వస్తుంటే ఆపాడు. ఫలానాచోట నన్ను దింపగలవా? అంటూ జాలిగా అడిగి వెళ్లాల్సిన అడ్రస్ చెప్పాడు.

"అలా దింపకూడదు సార్! రూల్స్ ఒప్పు కోవు! పాపం పెద్దవారు ఇంత బరువు మోస్తు న్నారు... సరే! ఎక్కండి. ఆటో అటే వెళ్తుంది. కానీ ఒక షరత్తు! ఎవరైనా ఆపితే... ఏదైనా అడిగితే ఎలాగూ షాపర్లు ఇంత పెద్ద బ్యాగు ఉన్నాయి కాబట్టి మీరు మాకు సంబంధించిన వాళ్ళే అని చెప్పాల్సివుంటుంది...ఎంతిస్తారు?"

అలాగే అన్నట్లు తలూపి "ముప్పై ఇస్తా... దగ్గరే కదా!"

"ఫర్వాలేదు. రండి! మీరు ఇచ్చే ముప్పైతో టీ తాగుతా!"

ఆటోఎక్కి తాను మోస్తున్న భారం దింపు కున్నాడు సోమేశ్వరరావు.

పదినిమిషాలు ఆ అడ్వర్టైజ్మెంట్ గోల వినే సరికి ఆటోదిగి వెళ్లిపోదామా అన్నంత చిరాకు కలిగింది.

మరో అరగంట ప్రయాణం గడిచేసరికి ఆటో ఆగింది.

అర్థం కాక ముఖం ముందుకు చాచి అయో మయంగా చూస్తూ ఆటో అతన్ని అడిగాడు.

ఆటో అతను సమాధానం చెప్పేలోగానే ఇద్దరు సోమేశ్వరరావును బయటకులాగారు.

మరో ఇద్దరు... చెంపల మీద టపటప వాయించి అతన్ని వంగబెట్టి వీపు మీద బాదారు.


ఆటో అతను పరిగెత్తుకుంటూ దూరంగా వెళ్లి అతని ప్రక్కనుండి ఆటోపోతుంటే ఆ ఆటో ఎక్కి వెళ్ళిపోయాడు.

"ఏరా! ఎందుకురా ఈ బట్టలవ్యాపారం? నాసిరకం బట్టలు అంటగట్టి ఎన్నాళ్లు మోసం చేస్తావు?... నువ్వు లాభపడాలి. మేము నష్ట పోవాలా? నువ్వు ఎప్పుడు వస్తావా అని కాపు కాసివున్నాం! పద పోలీస్ స్టేషన్‌కి... నాకు ఆటో నడపటం వచ్చు... ఎస్సై నాకు బాగా క్లోజు.. వాడ్ని ఆటోలో ఎక్కించండి'!' అంటూ దూరంగా అరుస్తూ వస్తున్న మల్లయోధుడు లాంటి వ్యక్తిని చూస్తుంటే పై ప్రాణాలు పైనే పోయాయి సోమేశ్వరరావుకు.

"అయ్యా! తక్కువలో కుదిరిందని బుద్ధి తక్కువై ఈ ఆటో ఎక్కాను. నాకూ ఈ బట్టల వ్యాపారానికి ఎలాంటి సంబంధం లేదు... రైల్వేస్టేషన్లో దిగగానే ఎంతో కొంత మాట్లాడు కొని వెళితే హాయిగా ఈపాటికి ఇంట్లో ఉండేవాడ్ని... ప్లీజ్! నన్ను వదిలేయండి!" అంటూ చేతులు జోడించి వాళ్ళను బ్రతి మాలటం మొదలుపెట్టాడు... పాపం మన సోమేశ్వరరావు.

## ఫోటో టూన్

రఘు






# పక్కింటావిడ

కట్టా రాంప్రసాద్‌బాబు, 9440140510



శ్రీగుదిబండి వెంకటరెడ్డిగారు నిర్వహించిన కథల పోటీలో బహుమతి పొందిన కథ

**సరిగ్గా మధ్యాహ్నం రెండు గంటల సమయంలో మంచినిద్రలో ఉండగా ఫోన్ మోగింది. ఈ టైములో ఎవరబ్బా అనుకుంటూ విసుగ్గా ఫోన్ అందుకుని "ఎవరూ?" అన్నాను. "నేను సత్యా! పక్కింటి పంకజాన్ని. అర్జంటుగా ఒకసారి రాగలవా. చిన్నపనుంది." అంది పంకజం.**

**అర్జెంటుగా రమ్మందని కంగారుగా లేచాను.**

"ఎవరు ఫోన్ చేసింది?" అడిగారు శ్రీవారు.

ఈ ఫోన్‌కాల్ ఆయనకి నిద్రాభంగం కలిగించింది.

"పక్కింటి పంకజం ఫోన్ చేసిందండి. ఏంటో అర్జెంటుట. ఓసారి వెళ్ళొస్తాను." అన్నాను.

"సరే అయితే ఏంటో కనుక్కుని వెంటనే వచ్చెయ్యి. మనం మూడు గంటలకు మ్యాట్నీకి వెళ్లాలనుకున్నాం. టికెట్స్ కూడా రిజర్వ్ అయ్యాయి." అన్నారాయన.

"అలాగే." అని చెప్పి వాష్‌రూంలోకెళ్లాను.

ఈ రోజు ఆదివారం మావారికి సెలవు కావడం, పిల్లలిద్దర్నీ మా తమ్ముడు ఉదయం వచ్చి అమ్మ పిల్లల్ని చూడాలంటోందని చెప్పి వాళ్ళని తీసుకెళ్ళడం, వాళ్ళు రేపు స్కూలుకి అట్నుంచటే వెళ్ళిపోతాననడంతో ఈ రోజు శ్రీవారితో ఆనందంగా గడపాలనుకున్నాను. ఈ మధ్య అసలు మాకు ఏకాంతంగా గడిపే అవకాశమే దొరకడం లేదు. పిల్లలు పెద్దవాళ్ళవడం, ఆదివారాలప్పుడు పుట్టింటినుంచో, అత్తింటినుంచో ఎవరో ఒకరు రావడం– ఎప్పుడూ బిజీ బిజీ అయి పోతోంది జీవితం.



ఈ రోజైనా మా సొంతం చేసుకోవాలనుకున్నాం. మధ్యాహ్నం మ్యాట్నీ కెళ్లి, తర్వాత షాపింగ్ చేసుకుని, డిన్నర్ స్టార్ హోటల్‌లో చేసి, ఇంటికొచ్చి చక్కగా కబుర్లు చెప్పుకుని ఆనందంగా గడపాలని ముందుగానే ప్లాన్ చేసుకున్నాం... అందుకే సాయంత్రం పని మనిషిని, వంటమనిషిని రావొద్దని చెప్పేసాను.


కాలింగ్ బెల్ నొక్కిన వెంటనే వచ్చి తలుపు తీసింది పంకజం.

"ఏమిటి పంకజం! అర్జెంటన్నావు?..." అన్నాను కంగారుగా.

"ఏం చెప్పమంటావు సత్యా! ఎల్లుండే మా అమ్మాయి నిశ్చితార్థం అని తెలుసుగా... ఇంట్లోనే సింపుల్‌గా చేద్దామనుకున్నాం... మొత్తం ఏభైమంది దాటరనుకున్నాం!... ముహూర్తం మధ్యాహ్నం 3.30కి వచ్చింది. అది టీ టైము కదా! స్నాక్స్ అవీ బజారునుంచి తెప్పించడమెందుకని... ఇంట్లోనే చేద్దామనే ఉద్దేశంతో ఈ రోజు హాటూ, రేపు స్వీటూ చేద్దామనుకున్నాను. ఈ రోజు సాయం చేయడానికి కామాక్షి వస్తానంది తీరా పిలిచేసరికి... ఆ ముచ్చి మొహంది ఊరెళ్లిందట. హేండిచ్చేసింది. కొంచెం నువ్వు సాయం చేస్తావని పిలిచాను." అంది పంకజం.

నా గుండెల్లో రాయిపడింది. పంకజం నోరసలు మంచిదికాదు. పనుందంటే కామాక్షిని అన్నట్టే నన్నూ ఏదో అంటుంది. ఇప్పుడేం చేయాలి!

"గంటలో అయిపోతుందా?" అడిగాను.




"ఎందుకవదు. ఇద్దరం ఉన్నాముగా!"

మూడింటికల్లా వెళ్లిపోవచ్చని సరే అన్నాను.

'నువ్వు చాలా మంచిదానివి సత్యా. ఎవరికైనా సాయం చేయడంలో ముందుంటావు." అంటూ రెండు బేసిన్ల నిండా కలపిన జంతికల పిండి, చెక్కవడల పిండి స్టవ్ ముందు పెట్టింది.

వాటిని చూసిన వెంటనే మతిపోయింది.

ఇవన్నీ గంటలో ఎలా అవుతాయి? సాయం చేయకపోతే ఈవిడతో బాధ వెళ్ళకపోతే శ్రీవారితో గొడవ! ఎలా?... ఏదయితే అదే అయిందిలే అని పంకజం ఇంట్లో జంతికలు, చెక్కవడలు చేయడానికి నిశ్చయించుకున్నాను.

"చూడు సత్యా! నేను ముందు జంతికలు చేసి బాండీలో వేస్తాను. నువ్వు వాటిని బాగా వేగాక తీసి ఆ పక్కనున్న డబ్బాలో వెయ్యి!" అంది.

నాకసలే పొయ్యి దగ్గర అలవాటు లేదు. వంటమనిషే అన్నీ చేయడంతో నాకు స్టవ్ దగ్గర పనే లేకుండా పోయింది. ఏంచేయను? తప్పలేదు మరి.

గంటలో అయిపోతాయను కున్నవి పూర్తయ్యేసరికి మూడుగంటలు పైనే పట్టింది.

అంతసేపు నిలబడి వుండడతో కాళ్ళు పట్టేసాయి. ఒళ్ళంతా నొప్పులతో పుల పరంగా వుంది. ఇంటికెలా వచ్చానో నాకే తెలీదు. శ్రీవారు చాలా సీరియస్‌గా వున్నారు. నాతో అసలు మాట్లాడలేదు. సారీ చెప్పినా గానీ నావంక చూడనేలేదు. కాఫీపెట్టుకుని తాగే ఓపిక లేక పారాసెటామాల్ టాబ్లెట్ వేసుకుని పడుకుండిపోయాను.


తెల్లారి వంటమనిషి కాఫీ తెచ్చి లేపేవరకు మెలకువ రాలేదు.

టైము చూస్తే తొమ్మిది కావస్తోంది.

"అమ్మా! అయ్యగారు టిఫిన్‌చేసి ఆఫీసుకెళ్లిపోయారమ్మా! ఏంటో ఈరోజు చాలా సీరియస్‌గా వున్నారు!" అందామె.

ఉండరామరి! ఎన్నో ఆశలు పెట్టుకున్న మనిషి. పంకజం వల్ల మా ప్రోగ్రామంతా అప్‌సెట్ అయిపోయింది. ఈరోజు స్వీటు చేయడానికి నాలాంటి ఒకదానొక్కర్ని ఫిక్స్ చేసుకునే వుంటుంది పంకజం.

ఇంతకీ అసలు విషయం ఏంటంటే, ఆ మర్నాడు జరిగిన నిశ్చితార్థానికీ, ఆ తర్వాత నెలరోజులకు జరిగిన పెళ్లికి నన్నుగానీ, మా అపార్ట్‌మెంట్లో వున్నవాళ్ళనెవరినీ గానీ పిలవకుండానే కూతురి పెళ్ళి చేసేసింది... మా పక్కింటి పంకజం.





# నెల నెలా నవ్వుల వెన్నెల




**ప్రపంచ తెలుగు కార్టూనిస్టులు** కలిసి ఏర్పరుచుకున్న వాట్సాప్ గ్రూపు సభ్యులు **ప్రతి నెలా ఒక అంశం** మీద హాస్యానందంలో వేసే కార్టూన్ల సమాహారం.

## ఈ నెల అంశం- ఉపాధ్యాయులు
















## కొంపముంచిన ఆ జాగ్రత్త !

**తర్కారావు ప్రింటింగు ప్రెస్సు ఓనరు. జీతం పెంచమని అతని కింద పనిచేసే సుబ్బారావు ఎప్పుడొచ్చినా... అతనికి ఓ కథ చెప్పి... దాని ముగింపు చెప్తే జీతం పెంచుతాననంటుంటాడు. ఇప్పుడు కూడా ఓ కథ చెప్పడం ప్రారంభించడంతో... సుబ్బారావు వినసాగాడు-**

"క్రికెట్ మైదానం అంత పెద్ద ఇంట్లో, ఒక నౌకరుగా పని చేస్తు న్నాడు వెంగళరావ్. ఉదయం సాయంత్రం ఇంట్లో అన్ని గదులనీ ఊడ్వడం, తడిగుడ్డ పెట్టడం అతని పని. మిగతా సమయంలో మొక్కలకి మొక్కుబడిగా నీళ్ళు పోయడం, కార్లు తుడవడం లాంటివి చేస్తాడు. అయితే అనుకోకుండా ఒక రోజు ఉదయం, ఓ చేతిలో చీపురూ, మరో చేతిలో చిన్న ప్లాస్టిక్ చేటా పట్టుకుని, ఆట మైదానంలోకి వెళ్ళే ఆటగాడిలా సరా సరి నేరుగా మెయిన్ బెడ్‌రూంలోకి వెళ్ళిపోయాడు.




అతన్ని చూసిన మానస, కెవ్వ్ అని గోలీ సోడా కొట్టినట్టు పెద్దగా అరిచి రెండు చెవులు మూసుకుంది.

ఆ తర్వాత కొంత తేరుకుని, తేలు కుట్టినట్టు పెద్ద గొంతుతో-

"దరిద్రుడా! నీకేం పోయేకాలం వచ్చింది?... వచ్చేముందు తలుపు తట్టో, కొట్టో రావాలి కానీ, ఇలా ఫైబర్ నెట్ స్పీడుతో తలుపుని నెట్టుకొచ్చేస్తావా! ఇన్ని నెలలుగా ఇంట్లో పని చేస్తున్నావ్... ఇంగువ చుక్కంత ఇంగితం లేదూ. ఇందాకే నేను చీర కట్టేసుకున్నాను కాబట్టి సరిపోయింది. అలా కాకుండా నువ్వు కాస్త ముందుగా తలుపు నెట్టినా, నేను కాస్త ఆలస్యంగా చీర కట్టినా ఏవయ్యేది?...ఎంత ఘోరం జరిగి పోయేది?!" అంటూ టాప్ లేచిపోయేలా వాడిపై అరిచింది.

ఆ మాటలకి వెంగళరావ్ చిన్నగా నవ్వుతూ- "మీరు బలేటోరే అమ్మగారూ! నాకామాత్రం తెలీదా ఏటి? నేను ఈ ఇంట్లో పనిచేస్తున్న ఇన్నాళ్ళలో అలాంటిది ఏదైనా జరిగిందా చెప్పండి.! ఎప్పుడూ జాగ్రత్త తీసుకునేవాడ్ని. కానీ ఈ రోజే ఏదో ఆదమరుపులో ఉండి, అలా విసిరేయబడ్డ బాల్‌లా గబాల్న మీ గదిలోకొచ్చేసానండీ! " చెప్పాడు నేల చూపులు చూసి బుర్ర గోక్కుంటూ.

ఆ మాటలు విన్న మానస కాస్త శాంతించి- "సర్లే! ఏదో నీకు పిచ్చి పట్టి తగ్గిందని జాలిపడి నిన్ను పనిలో పెట్టుకున్నాను. పిచ్చి వేషాలు వేయవనే పూర్తి నమ్మకం నీ మీద నాకుందిరా! అయినా... ఎవరూ తలుపు తట్టకుండా రారనే ధీమాతో నేనూ ఈ రోజు గడియ పెట్టలేదు!" చెప్పింది వెంగళరావ్ వంక ప్రశాంతంగా చూస్తూ.

"సరే అమ్మగారూ! వస్తానూ" అని వాడు వెళ్ళిపోతుండగా... మానస ఏదో గుర్తొచ్చినట్టు- "అవునూ! నువ్వు ఇందాక ఎప్పుడూ జాగ్రత్త తీసుకునేవాడ్నీ... కానీ ఈ రోజే ఇలా ఆదమరుపులో బెడ్‌రూం గదిలోకి వచ్చేసానన్నావ్! ఇంతకీ ఏవిట్రా ఆ జాగ్రత్త?!" అడిగింది ఆశక్తిగా.

దానికి వెంగళరావ్ చిన్నగా నవ్వేస్తూ... "భలే వారే అమ్మగారూ! మీరింత ఇదిగా అడిగితే చెప్పనా?" అంటూ వాడు పాటించే ఆ జాగ్రత్త గురించి వివరంగా చెప్పి చెప్పగానే, వాడ్ని చీపురు తిరగేసి మరీ చితక్కొట్టి బయటికి గెంటేసింది... ఇప్పుడు చెప్పు! వాడు అలాంటివి జరగకుండా తీసుకున్న జాగ్రత్త చెబితే ఆమెకి ఎందుకంత కోపం వచ్చింది? అసలు వాడేం చెప్పి ఉంటాడు." అడిగాడు తర్కారావ్.

"చాలా సింపుల్ సార్! ఇది వరలో గది తలుపు కొట్టడవో, పిలవడవో చేసి వెళ్ళేవాడేమో... ఈరోజు ఓ చేతిలో చేట, మరో చేతిలో చీపురూ ఉండి పోవడం, పైగా కొంత ఆదమరుపులో తలుపు తట్టడానికి బదులు గోడని తట్టి లోపలికి వెళ్ళిపోయాడేమో, ఎప్పుడూ ఆ జాగ్రత్త పాటించేవాడు కాస్తా, ఈ రోజు అజాగ్రత్తతో వెళ్ళిపోవడంతో అతని ఖర్మ కాలిపోయింది, ఒళ్ళు హూనవైంది, ఆ తర్వాత అతని పని పోయింది. నేను చెప్పింది కరెక్టేనా సార్!" అడిగాడు చిన్న చిరునవ్వుతో నమ్మకంగా.

"తలా తోకా లేని ఏదో పొంతన లేని సమాధానం చెప్పావ్! అసలు విషయం అది కాదు తమరి బొంద! వాడు ఎప్పుడు ఎవరి గదిలోకి వెళ్ళాలన్నా, వాడు తీసుకునే జాగ్రత్త ఏవిటంటే... ఆ వెళ్ళబోయే గది తలుపు తాళం కన్నంలోంచి చూసి ఆ తర్వాత తలుపు తట్టడవో... లోపలికి వెళ్ళడవో చేసేవాడు. అదీ వాడు ఇన్నాళ్ళుగా ఆ ఇంట్లో తీసుకున్న జాగ్రత్త. ఆ విషయమే ఆమెకి చెప్పడంతో, ఆమెకి కొండంత కోపం వచ్చి, వాడ్నలా చితక్కొట్టి బయటికి గెంటేసింది... అదీ అసలు సంగతి... నువ్వు కనీసం దగ్గరగా కూడా చెప్పలేక పోయావు కనుక ఈ సారి కూడా నీ జీతం పెంచడం జరగదు..." అని తర్కారావు చెప్పగానే...

"మీ తర్కం మీదే కానీ నా తరపు అర్థం చేసుకోరు కదా!.." అనుకుంటూ అక్కడ్నుంచి వెళ్ళిపోయాడు సుబ్బారావ్.

# నేను అనుకున్నాను!



అభిమన్యు,
9440204748

**నిత్యానందం నడుస్తున్నాడు. అతని నడకలో, ముఖంలో విసుగు, చిరాకు కనిపిస్తున్నాయి.**

**అందుక్కారణం తన ఇద్దరి పిల్లల ప్రవర్తన.**

**నిత్యానందంకి కూతురు, కొడుకు.**

**కూతురు రమ్య ఇంటర్ చదువుతోంది.**

**కొడుకు ఆనంద్ టెన్త్ చదువుతున్నాడు.**

**ఇద్దరికీ ఇద్దరూ పెంకిగా తయారయ్యారు.**

ఎవరి మాట వినరు. తల్లి మాట వినరు...తండ్రి మాట వినరు.

వారి చేతుల్లో ఎప్పుడూ సెల్‌ఫోన్ ఉండాలి... అది రాత్రయినా, పగలైనా. ఆ సెల్ యావలో పడి ఎప్పుడు తిండి తింటున్నారో, ఎప్పుడు నిద్రపోతున్నారో తెలియడంలేదు. వారిని దారిలోకి తేవడం గగనమై పోతోంది.

నడుస్తున్న నిత్యానందానికి ఒకింటికి ఒక బోర్డు వ్రేలాడదీసి ఉండడం కనిపించింది.

దానిమీద 'టీనేజర్స్ హోమ్' అని అందంగా రాసి వుంది.

ఓల్డేజ్‌హోమ్ చూసాడు... పిల్లల హాస్టల్స్ చూసాడు... కాని, ఇలా 'టీనేజర్స్ హోమ్' చూడడం ఇదే ప్రథమం.

ఆశ్చర్యపోతూ గేట్ తీసుకుని లోపలికి వెళ్ళాడు. నిత్యానందం.

ఆ హోమ్ మేనేజర్ నిత్యానందాన్ని సాదరంగా ఆహ్వానించి కుర్చీ చూపించాడు.

నిత్యానందం చిన్నగా నవ్వి– "ఈ టీనేజర్స్ హోమ్ ఏమిటి?! పేరు వింతగా వుంది! ఏం చేస్తారు?!" అని అడిగాడు.

"ఓ అదా!... మాట వినని, చెప్పినట్లు వినని టీనేజర్స్‌ని జాయిన్ చేసుకుంటాం. వారికి ట్రైనింగ్ ఇస్తాం... ఇది పదిహేను రోజుల కోర్సు!" అని చెప్పాడు పరాంకుశం.

"ట్రైనింగ్ అంటే ఏం ఇస్తారు...?" అడిగాడు నిత్యానందం.

"చదివిస్తాం... ఆడిస్తాం.... రకరకాల పనులు నేర్పిస్తాం! ముఖ్యంగా సెల్‌ఫోను అంటే అసహ్యం కలిగేట్టు చేస్తాం!" అని చెప్పాడు పరాంకుశం.

నిత్యానందం తన ఇద్దరి పిల్లల గురించి చెప్పాడు.

'వారికి సెల్ తప్ప మరో లోకం తెలీదని, ఎన్నిసార్లు వారి దగ్గర్నుండి సెల్లులు లాక్కున్నా గొడవకి వచ్చేవారని... ఇల్లు వదిలి పారిపోయే వారు వారి స్వేచ్ఛకు అడ్డు తగులుతున్నామని ఇలా..."

పరాంకుశం అంతా విని– "మీ పిల్లల్ని పంపించండి మేము చూసు కుంటాం!" అని ఫీజు వగైరాలన్నీ చెప్పి నిత్యానందంని ఒప్పించాడు.

నిత్యానందం చాలా ఆనందంగా ఫీల్ అయ్యి... అట్నుంచి అటే బ్యాంకుకి వెళ్ళి డబ్బులు డ్రా చేసి పరాంకుశంకి కట్టి ఇంటికి వెళ్ళాడు.

తలుపులు వేసి ఉన్నాయ్.

కాలింగ్ బెల్ రెండు సార్లు మ్రోగించిన కొంతసేపటికిగాని భాగ్యలక్ష్మి తలుపు తీయలేదు.

"ఇంతసేపా! లోపల ఏం చేస్తున్నావ్? సీరియల్స్ చూస్తున్నావా....?" అని కసురుకున్నాడు.

"ఆc... వంట చేస్తున్నాను. ఎంతసేపూ నా సీరియల్స్ మీదే ఏడుపు... వీధిలో ఇల్లు, ఏ ఆకతాయి కాలింగ్ బెల్ నొక్కుతాడో తెలియదు..." అంటూ లోనికి పోయింది భాగ్యలక్ష్మి.

నిజానికి భాగ్యలక్ష్మి సెల్‌లో సీరియల్ చూస్తుంది.

నిత్యానందం చేసిన పని గురించి భార్యకు చెప్పి...

"ఇహ మన పిల్లలు సెల్ గురించి అడ గరు!..." అన్నాడు ఉత్సాహంగా.

"ఏడ్సినట్టే ఉంది మీ తెలివి... ఇంత అమా యకంగా ఎలా ఉన్నారండీ... లోకం తీరు తెలియడం లేదా! ఈ రోజుల్లో సెల్ లేనిదే నిమిషం గడవదు. అయినా మన పిల్లలు సెల్‌కి ఏమీ బానిసలు అయిపోలేదు... వెళ్ళండి! వెళ్ళి ఆ ఇచ్చిన డబ్బులు తిరిగి తీసుకోండి!" అని చెప్పింది భాగ్యలక్ష్మి.



నిత్యానందం తాను పట్టిన కుందేలుకి మూడేకాళ్ళు అన్నట్లుగా కదలలేదు... మెదల లేదు.

అతగాడి వాలకం చూసి భాగ్య లక్ష్మి నెత్తి బాదుకొని 'కర్మ... కర్మ...' అనుకుంటూ లోపలికి పోయింది.

ఆ రాత్రి పన్నెండు అయ్యింది.

సెల్లులు ఆపి పిల్లలిద్దరూ నిద్రపోతు న్నారు. అది గమనించి నిత్యానందం పరాంకుశంకి ఫోన్ చేసాడు. పరాంకుశం టాక్సీని, ఇద్దరు మనుషుల్ని పంపాడు. ఆ ఇద్దరూ పిల్లలిద్దర్నీ టాక్సీలో వేసుకుని పోయారు.

వాళ్ళతో పాటు అంతకుముందే రెడీ చేసి ఉంచిన వారి బట్టల బ్యాగులు కూడా తీసుకుపోయారు.

మర్నాడు ఉదయం పిల్లలు లేకపోవడం చూసి భాగ్యలక్ష్మి గోల గోల చేసింది.

ఎలాగైనా ఇప్పుడే, ఈ క్షణమే పిల్లలు రావా లని ఏ పనీ చేయకుండా భీష్మించుక్కూర్చుంది.


భార్యను సముదాయించడం నిత్యానందం వల్ల కాలేదు.

ఆఫీసుకి సెలవు పెట్టి... వంట పనిలో పడ్డాడు. టిఫిన్ తయారుచేసి బలవంతంగా భార్య చేత తినిపించాడు.

ఒక పక్క టిఫిన్ తింటూనే 'పిల్లలు... పిల్లలు...' అని రాగాలు తీయడం మానలేదు.

నిత్యానందం ఆ రాగాలు వింటూనే తన వంట పనిలో తనున్నాడు.

"సెల్లులు వలన పిల్లలు చెడిపోతున్నారనీ, రోగాల బారిన పడుతున్నారనీ వారిని కోచింగ్ కి పంపానని... పిచ్చుకలు, కాకులు, పావు రాలు, చిలుకలు ఇంకా చిన్ని చిన్ని పక్షులు, జీవులు సెల్ టవర్స్ ద్వారా వెలువడే రేడియే షన్ వేవ్స్ వలన నశించిపోతున్నాయనీ... అలాగే మనిషి కూడా పేర్లు తెలియని రోగాల బారిన పడుతున్నాడనీ ఈ రోగాలకి సరియైన మందులు కనిపెట్టలేక పోతున్నారనీ..."



ఇలా నిత్యానందం భాగ్యలక్ష్మికి నచ్చచెప్ప డానికి ప్రయత్నం చేసాడు.

భాగ్యలక్ష్మి వినలేదు.

ఆ మధ్యాహ్నం... నిత్యానందం చెల్లెలు సావిత్రి – దిగబడింది తన ఇద్దరు పిల్లలతో. సావిత్రి వాళ్ళ ఊరులోనే ఉంటున్నారు. భర్త ఉద్యోగరీత్యా కేంపుల కెళ్తే... ఈవిడగారు ఇలా అన్నయ్య ఇంటికి వచ్చి... రెండ్రోజులు ఉండి వెళ్తుంది. సావిత్రికి ఆరేళ్ళ కొడుకు, రెండేళ్ళ కూతురు.

ఇంటి వాతావరణం సీరియస్‌గా ఉండడం గమనించి వదిన ద్వారా విషయం తెలుసుకుని బుగ్గలు నొక్కుకుంది.

"ఏరా అన్నయ్యా! ఇలా చేసావ్! నీ పిల్లలు రత్నాలు. తెలివైనవాళ్ళు. ఏదేదో ఊహించు కుని వాళ్ళను అక్కడెక్కడో జాయిన్ చేస్తావా? నీ తెలివితేటలు ఏమయ్యాయి? అయినా సెల్ అవసరం లేనిది ఎవరికి?... సెల్ వాడనిది ఎవరు?" అని అడిగింది.

"నీకు ఏమీ తెలీదు ఊరుకో!" చిరాకు పడ్డాడు నిత్యానందం.

"మా బంటిగాడు (కొడుకు) స్కూలు నుంచి రాగానే వాడికి సెల్ కావాలి, వీడియో గేమ్స్ ఆడుకోవడానికి... లేదంటే నానా అల్లరి చేస్తాడు. ఇదిగో ఈ చంటిది (కూతురు) సెల్ చూపించనిదే అన్నం తినదు, పాలు తాగదు." అంది సావిత్రి.

"నువ్వు అలా అలవాటు చేసావు!"

"అలవాటు కాదన్నయ్యా! కాలం... కాలం తో పాటు మనం మారాలి. టెక్నాలజీ ఎంతలా డెవలప్ చెందుతుందో నీకు తెలియనిదికాదు. ప్రమాదాలు జరుగుతున్నాయని విమానాలు ఎక్కడం మానేస్తున్నారా! రోగాలు వస్తున్నాయని మనిషి మనుగడ మానేస్తున్నాడా! నీ ఆలోచన సరికాదు. వెళ్లి పిల్లల్ని తీసుకురా....." అంది సావిత్రి.

✦✦✦

పది రోజుల తర్వాత టీనేజర్స్ హోమ్‌కి వెళ్ళాడు నిత్యానందం కోచింగ్ క్లాసులు ఎలా

జరుగుతున్నాయో చూద్దామని.

అక్కడికి వెళ్లాక అక్కడి దృశ్యం చూసి కుతకుతమని ఉడికిపోయాడు నిత్యానందం.

కొంతమంది పిల్లలు గేదెల్ని కడుగుతున్నారు.

కొంతమంది కసువు ఊడుస్తున్నారు.

మరికొంతమంది పాలు పితుకుతున్నారు.

నిత్యానందం కోపంతో అక్కడే వున్న దుడ్డు కర్రను తీసుకుని మేనేజర్ రూమ్ వైపు వడి వడిగా నడిచాడు.

రూమ్‌లో అప్పటికే పదిమంది వరకూ పేరెంట్స్ ఉన్నారు.

వాళ్ళంతా చాలా ఆవేశంగా ఉన్నారు.

కొంతమంది చేతుల్లో కర్రలు, మరికొంత మంది చేతుల్లో బెల్టులు ఉన్నాయి.

వారికెదురుగా... మేనేజర్ పరాంకుశం మాట్లాడుతున్నాడు.

"....ఇది కోచింగ్ సెంటర్. మీరు ఇష్టపడి మీ పిల్లల్ని చేర్పించారు. గేదెల్ని, గుర్రాలని కడగడం, గొర్రెల్ని మేపడం లాంటివి మా శిక్షణలో భాగం. శారీరకంగా శ్రమిస్తే మిగతా ఆలోచనలు రావు. ఇంతవరకూ మీ పిల్లలు సెల్ గురించి అడగలేదు... మీరు చాలా ఆవేశంలో వున్నారు. మీ పిల్లల్ని కోచింగ్ పూర్తి అయ్యేవరకూ నేను పంపను! అలాగని అగ్రిమెంట్ కుదుర్చుకున్నాను."

ఎవ్వరూ ఏం మాట్లాడలేకపోయారు.

కుక్కిన పేనుల్లా వెనుదిరిగారు...

నిత్యానందం కూడా.

✦✦✦

కోచింగ్ అయిపోయింది.

పిల్లలు ఇంటికి వచ్చేసారు.

బుద్ధిగా చదువుకుంటున్నారు. సెల్లుల జోలికి వెళ్ళడంలేదు.

'హమ్మయ్యా' అనుకున్నాడు నిత్యానందం


రాత్రి పన్నెండు దాటింది.


దాహం వేసి నిద్ర లేచాడు.


పిల్లల గదిలోంచి ఏవేవో శబ్దాలు వస్తుంటే తలుపులు మెల్లగా తెరచి చూసి ఆశ్చర్యపోయాడు.

లోపల పిల్లలు సెల్‌లో వీడియో గేమ్స్ ఆడుతున్నారు.

# తీరులు!







# నిరాహార దీక్ష



జి.రంగబాబు,
9440190669

**"ఏమోయ్ పి.ఏ...! ఈ రోజు నా అపాయింట్మెంట్లన్నీ కేన్సిల్ చేసేసేయ్..!" అన్నాడు ఎమ్మెల్యే గోకర్ణం తన భారీ కాయాన్ని భారంగా మోసుకుంటూ మెట్లుదిగుతూ.**

గోకర్ణం ప్రతిపక్ష పార్టీ ఎమ్మెల్యే. బాగా డబ్బున్న వాడు.

నాలుగైదు లిక్కర్ షాపులు, చాలా ట్రాన్స్పోర్ట్ లారీలు ఉన్నాయి. ఎలక్షన్స్‌లో డబ్బులు బాగా పంచడం వలన అక్కడి వాళ్ళు అతన్ని గెలిపించారు. కాకపోతే భారీ కాయం. అసెంబ్లీలో వాద ప్రతివాదాలు జరుగుతున్నా వాటినేం పట్టించుకోకుండా నిద్రపోతుంటాడని కూడా చెప్పుకుంటారు.

"మరేం చేస్తారు సార్ ఈ రోజు?" అనడిగాడు పి.ఏ. నాగరాజు.

"రాష్ట్ర ప్రభుత్వం పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించమని... అధిక ధరలు అరికట్టాలనీ కొందరు ఉద్యోగులు... ఉపాధ్యాయులు... కార్మికులు నిరాహారదీక్ష చేస్తున్నారట! నేను కూడా వారితో కూర్చుని నిరాహారదీక్ష చేస్తాను! ఆ ఏర్పాట్లు చూడు!" అన్నాడు ఎమ్మెల్యే గోకర్ణం.

వెంటనే ఏర్పాట్లు చేసేశాడు పి.ఏ.

ఎమ్మెల్యే అంతటివాడు తమ దీక్షకు మద్దతు తెలపడానికి రావడంతో వారంతా చాలా ఆనందంగా ఆహ్వానించారు.

వచ్చీ రాగానే అందరికీ అచ్చమైన రాజకీయ నాయకునిలా నమస్కారం పెట్టాడు.

తరువాత టెంటులో వారితో పాటు కూర్చుని ఉపన్యాసం కూడా ఇచ్చాడు.

ఆయన అసౌకర్యం ఫీల్ అవడం గమనించారక్కడి వారు.

కారణం లేకుండా ఏ పనీ చెయ్యని ఎమ్మెల్యే హఠాత్తుగా ఇలాంటి నిర్ణయం ఎందుకు తీసుకున్నాడో అర్థం కాని ఒకాయన పి.ఏ. నాగరాజుని ప్రక్కకు పిలిచి...

"ఈయన ఇంత హఠాత్తుగా ఈ నిర్ణయం ఎందుకు తీసుకున్నట్టు? నిరాహారదీక్ష లో కూర్చుని వీరికి మద్దతు ఎదుకు తెలుపుతున్నట్టు?" అడిగాడు.

దానికి ఆ పి.ఏ.నాగరాజు చిన్న నవ్వు నవ్వి...

"మద్దతు తెలపడమా!... నా బొంద! అసలు కారణం అది కాదు!" అన్నాడు.

"మరేంటి?..." అన్నాడతను మరింత కుతూహలంగా.

"నిన్న రాత్రి సారు ఒక ఫంక్షన్ కి వెళ్లారు. ఆయన భోజన ప్రియుడు. పీకల్దాకా తాగి, నాన్ వెజ్ ఐటమ్స్ అయిన చికెన్, మటన్, ఫిష్, ప్రాన్స్ అన్నీ అన్ లిమిటెడ్ గా లాగించేశాడు. ఆ ఫుడ్ అరక్క రాత్రంతా నానా ఇబ్బందీ పడ్డాడు. అందుకని ఈ రోజు ఏమీ తినకుండా పస్తు ఉండాలని నిర్ణయించుకున్నాడు. ఎలాగూ ఈ రోజు ఏం తినకూడదని అనుకున్నాడు కాబట్టి పుణ్యం, పురుషార్థం కలిసొస్తాయని...ఇలా నిరాహారదీక్ష లో కూర్చున్నాడు.. అదీ అసలు సంగతి !

""ఆఁ!" అని నోరెళ్ళబెట్టాడు అవతలి వ్యక్తి.



# నవ్వించే రాగాలు

RRR చిత్రంలోని
నాటు... నాటు... పాటకు పారడి

-ఎన్.పి.ఎస్.రావు, న్యూజిలాండ్

పొలం గట్టు బురద లోన.. పోట్ల గిత్త తరిమినట్టు
పోలీసుల లాఠీతో కవుకు దెబ్బ తగిలినట్టు
మూలి గేటి నక్క మీద... తాటి పండు రాలినట్టు
ముల్లు గుచ్చు కున్న కోతి ... నిప్పు కణిక తొక్కినట్టు
మిడిల్ క్లాసు ఫ్యామిలీకి...నడుం విరిగి పోయినట్టు...
ఈ పోటు సూడూ... ఈ పోటు సూడూ...ఈ పోటు సూడూ
పోటు పోటు పోటు పోటు పోటు పోటు వీర పోటు
పోటు పోటు పోటు పోటు పోటు పోటు పన్ను పోటు
పోటు పోటు పోటు పిచ్చి పట్టినట్టు పిచ్చ పోటు
పోటు పోటు పోటు వచ్చి పడ్డదింక పన్నుపోటు

**చరణం 1:**
గుండెలదిరిపోయేలా... జీఎస్టీ బాదినట్టు
గూబ గుయ్యి మనేలాగ...పన్ను పోటు పెట్టినట్టు
కళ్ళు తిరిగి పోయేలా ధరలు నింగి సేరినట్టు
ఏలు డబ్బు పోస్తున్నా సంచి సగం నిండనట్టు
మధ్య తరగతోడి ఒళ్ళు సెమట పట్టి ఒణికినట్టు
॥ఈ పోటు సూడూ...॥

పోటు పోటు పోటు పోటు పోటు పోటు వీర పోటు
పోటు పోటు పోటు పోటు పోటు పోటు పన్ను పోటు
పోటు పోటు పోటు.. గడ్డ కాల మొచ్చి చెడ్డ పోటు
పోటు పోటు పోటు ఉసురు తీసే లాగా పన్ను పోటు

**చరణం 2:**
కడుపు మండి పోయేలా...
జేబు లోని డబ్బులన్ని ..ఆవిరయ్యి పోయేలా
ఏసేయ్ రో ఎకాఎకీ...
పోటు పోటు పోటో...వాహ్....ఏస్కో
అరె దుమ్ము దుమ్ము కరిసేలా
నెల జీతపు రాళ్లన్నీ..ముక్కు పిండి లాగేలా
పన్నేసేయ్ సరాసరి
॥పోటు... పోటు...పోటో...॥

# టీ శతకం

-విట్టుబాబు

టీకొట్టున గ్రామప్రజ
జోకొట్టర చింతలం బరిశోధనలందున్
దాకట్టుల యప్పులనట
టీకొట్టుచుం దేల్తురేమొ టెక్కులతో 'టీ'. ॥61॥

టీ కొట్టు చట్టసభయగు
జైకొట్టర చిన్నపెద్ద సరి! జాతరలో,
నాకట్టుకొనగ నూరున
టీకొట్టుండొకటి యైన డింగరివే 'టీ'. ॥62

టీ కొట్టే యాటవిడుపు
టీ కొట్టే గమ్యమింక డీలా పడగా
టీ కొట్టే యమృతవనము
టీ కొట్టే సకల జనుల డెందములన్ 'టీ'. ॥63॥

చిక్కదనము, రంగును, రుచి
చక్కదనపు పొంగులీను జాణవు నీవే
లెక్కయె జేయని మనుజుల
తిక్కను భరియించవమ్మ త్రీ రోజెస్ 'టీ'. ॥64॥

చక్కని దానవు! కరముల
చిక్కిన దానవు! దగిలిన జిమ్మకు సుఖమున్!
జిక్కని దానవు సరసీ!
చెక్కిన నీ తీపిముద్దు చెలువము పోటీ (పో! టీ!!). ॥65॥

పాలను మరగించునపుడు
నేలకులను దంచి యల్లమే కలుపంగా
గ్రోలంబోవుటకు మునుపె
నీ లావణ్యమును జూసి నే మురిసితి 'టీ'. ॥66॥

తలనొప్పికి మందువు! బా
ధల మునిగిన మానసంబు, దాపము గలుగం
దలతుము నిన్నే ఝరి! ఝా
తలమందున హేలవమ్మ! తాపసివే 'టీ'. ॥67॥

ఏదారియు లేనప్పుడు
గోదారినిం గలసినపుడు గూలిన బ్రతుకుల్
సేదనుం దీరుట కొఱకై
నీదారియె బట్టు నిజము నెమ్మదివే 'టీ'. ॥68॥

# భూషయ్య



యు.విజయశేఖర రెడ్డి,
9959736475

**భూషయ్య వడ్డీ వ్యాపారం చేస్తూ డబ్బు బాగా సంపాదించాడు. దానితో ఎన్నో వ్యాపారాలు మొదలు పెట్టాడు. అతను బహు పిసినారి. అతని భార్య లక్ష్మి, ఆమె భర్త కంటే మహా పిసినారి.**

వారికి ముగ్గురూ మగపిల్లలే, పుట్టుకతోనే వారిని కూడా పిసినారి అనే ఉగ్గు పాలను పోసి పెంచారు భూషయ్య,సీతమ్మలు.

"మగపిల్లలనే కన్నారు.. అంతా తెచ్చుకునేదే గాని మీరు ఇచ్చుకునేది ఏమీ లేదు." అని భూషయ్యతో అనే వారు ప్రతి ఒక్కరూ.

భూషయ్య తన పిల్లలు రామయ్య, సోమయ్య, భీమయ్యలను పదవ తరగతి వరకే చదివించాడు. ఒక్కొక్కరికి ఒక్కొక్క వ్యాపారం అప్పజెప్పి వారిని రాటుదేలేలా చేశాడు. పెద్ద ధనవతుడైన భూషయ్యతో వియ్యం అందాలని చాలా మంది పోటీపడ్డారు. కానీ భూషయ్య, సీతమ్మలు తొందర పడకుండా వారికంటే పిసినారి సంబంధం కుదుర్చుకున్నారు. చెంగయ్య అనే అతనికి ముగ్గురూ కూతుళ్లే. ఆయన కూడా భూషయ్య గురించి విని సంతోషపడి వియ్యం అందుకున్నాడు.

వచ్చిన కొత్త కోడళ్ళు పార్వతి, సుమతి, సరస్వతి.

వారు కూడా అంతా కలసిమెలసి ఉండాలి... ఒకే పొయ్యి వెలిగించాలి... అనే సిద్ధాంతం పాటించారు. రామయ్య, సోమయ్య, భీమయ్యల భార్యలు, భర్తలకు అన్నీ విషయాలలో చేదోడు వాదోడుగా ఉండేవారు.

డబ్బు! ఉన్న వారి వద్దకే మరింతగా చేరుతుందట... అది ఉన్న వారి వద్దకే మరో జబ్బు అంటుకుంటుంది. భూషయ్యకు ముగ్గురు కోడళ్ళు వచ్చాక ఆస్తి రెట్టింపు అయ్యింది. ఇంత డబ్బు ఏం చేసుకోవాలని భూషయ్య ఒక రాత్రి అదే పనిగా ఆలోచించి... ఆలోచించి గుండె పోటుతో చనిపోయాడు.

భార్య, పిల్లలు, కోడళ్ళు కన్నీరు పెట్టుకున్నారు.

తెల్లారింది అంతా మాట్లాడుకుని మధ్యాహ్నం పన్నెండు గంటలకల్లా శ్మశాన కార్యక్రమాలు పూర్తి చేయాలని ఒకే మాటగా అనుకున్నారు.

"ఒరే అబ్బాయిలూ! కడసారి కదా నాన్నాను శ్మశాననికి చిన్న ట్రక్కులో పూలతో బాగా అలంకరించి ఊరేగింపుగా తీసుకెళదాము!" అని అంది సీతమ్మ.

"అనవసరంగా డబ్బు ఖర్చు పెడితే నాన్న ఆత్మ శాంతించదు... కాబట్టి ఆటోలో తీసుకెళదాము!" అన్నాడు సోమయ్య.

"అన్నలూ మీరిద్దరూ మరీ పిచ్చి వాళ్లురా... నాన్నాను నాలుగు చక్రాల తోపుడు బండిలో తీసుకెళితే ఎంతో ఖర్చు తగ్గుతుంది ఏమంటారు?" అన్నాడు భీమయ్య.


సీతమ్మ,రామయ్య కూడా ఒప్పుకున్నారు.

"ఒరే మీరంతా అనవసరంగా డబ్బును ఖర్చు పెడతారురా... శ్మశానం చేరుకోవడానికి పది నిముషాల సమయం కూడా పట్టదు... నేను నడుస్తూనే వస్తాను పదండి" అని భూషయ్య పాడే మీద నుండీ లేచి నడుస్తూ శ్మశానం చేరుకుని అక్కడ ప్రాణాలు వదిలాడు. సీతమ్మతో పాటూ అందరూ బిత్తరపోయారు.

తక్కువలో తక్కువగా భూషయ్య అంతిమ కార్యక్రమాలు ముగిశాయి.

"హమ్మయ్య మీ నాన్నగారి ఆత్మ ఇప్పుడు ఎంతో శాంతిస్తుంది" అంది సీతమ్మ.

"అవును!" అన్న భూషయ్య మాటలు వారికి వినిపించాయి.






**గతంలో...** అమెరికాలో స్థిరపడ్డా బ్రహ్మాచారి చందు. అందరికీలానే చందు పెళ్ళికోసం తండ్రి తన మరదలు సుబ్బలక్ష్మిని పెళ్ళి చేసుకోమని నెత్తినోరు కొట్టుకుని మొత్తుకుంటుంటాడు. తనకి మరదలు మీద ఏ ఫీలింగ్ లేదని చందు తెగించి చెప్పేస్తాడు. మూడు నెలల్లో యోగ్యురాలైన అమ్మాయిని తెచ్చి మా ముందు పెట్టు... లేదంటే చచ్చిపోతానని బెదిరిస్తూ తండ్రి ఈమెయిల్ పంపిస్తాడు. అమ్మాయిని వెతికే పనిలో ఉంటాడు చందు. మెక్సికన్ కిడ్నాపర్ ఓలేకి, సుబ్బు ఒక ఫోటో ఇచ్చి, ఆ అమ్మాయిని కిడ్నాప్ చేయమని చెప్తాడు. ఆ అమ్మాయి తెలంగాణ అసోసియేషన్ వారు నిర్వహిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాల్లో 6వ అయిటమ్ చేసే అమ్మాయని చెప్తాడు. ఆ కార్యక్రమం అయిపోయాక సౌమ్యను కిడ్నాప్ చేసి, ఒక గదిలో బంధిస్తాడు ఓలే!.... సౌమ్య ఓలేని నానా విధాలుగా ఇబ్బంది పెడుతుంటుంది. ఆమె పెట్టే ఇబ్బందులు భరించలేక ఆమెని విడుదల చేస్తాడు ఓలె. ఇందు నాన్న తెలంగాణ అబ్బాయికే యిచ్చి ఇందు పెళ్ళి చేయాలనుకుంటుంటాడు. ఆంధ్ర కుర్రాడు చందుని ఇష్ట పడుతుంది ఇందు. అయితే ఇందు నాన్న తెలంగాణ అబ్బాయికే ఇందునిచ్చి పెళ్ళి చేయాలనుకునేందుకు కారణం వంద సంవత్సరాల గతంలోకి వెళ్ళాల్సిందే... అలా వెళ్ళాక... సుబ్బారావు. అప్పన్నలు పోలీస్ ట్రైనింగ్ కోసం హైదరాబాద్ వెళతారు. ఖాళీ టైంలో ఒక గుర్రపు బండిని మాట్లాడి సిటీ చూడ్డానికి బయలుదేరుతారు... గోల్కొండ కోట దగ్గర్నుంచి ఒక పొట్టి వ్యక్తి వీళ్ళను వెంబడిస్తుంటాడు. అతన్ని ఆపి సుబ్బారావు ప్రశ్నలు అడుగుతాడు... **ఆ తర్వాత.....**

**ప్రస్తుతం...**

**"పోనీ... హత్య, హంతకుడు, రక్తం, కత్తి, పేగులు, చావుకేక, శవం...ఈ పదాలను ఉర్దూలో ఏమంటారు?**

**"ముఝే నహీ మాలుం హై!" అన్నాడు భయంతో నిండిన కళ్ళతో చూస్తూ.**

**"తెలుగును ఉర్దూలోని అనువదించి... ఒక్క వాక్యం చెప్పలేవు... ఒక్క పదం చెప్పలేవు! హైదరాబాద్‌లో ఎందుకుంటున్నావ్ నువ్వు?" అన్నాడు అప్పన్న.**

**"ముఝే నహీ మాలుం!"అనేసి గబగబా అక్కడి నుంచి తన అట్లాస్ సైకిల్ వైపు వెళ్ళిపోయాడు.**

ఈ లోపు బాషా నిద్ర లేచి, వీళ్ళ దగ్గరికొచ్చాడు.

"అచ్చా! గోల్కొండ సూషింద్రా షాబ్?"

"ఆఁ! చూసాం..."

"పోదామా షాబ్?"

"సరే..."

"గుర్రపు బగ్గీ నడపడం శానా కష్టం షాబ్... బండి నడపాలి అంటే షానా తెలివి ఉండాలె! మీ లెక్క పోలీస్ ఉద్యోగం చేసినంత వీజీ కాదు షాబ్!" అన్నాడు బాషా.

అప్పన్న,సుబ్బారావు మొహామొహాలు చూసి నవ్వుకున్నారు.

గుర్రపు బగ్గీ... వీళ్ళను అనుసరిస్తూ అట్లాస్ సైకిల్ బయల్దేరాయి.

తిరుగుప్రయాణంలో...తన జీవితంలోని కష్టాలు, కన్నీళ్ళు... గుర్రపు బగ్గీ నడిపి తాను

ఎలా తన ముగ్గురు భార్యలను, 15 మంది పిల్లలను పోషిస్తున్నాడో...ఆ బరువైన కహానీలు, బాషా వివరించసాగాడు.

ఇలా చెప్పి... మరో పావలానో, అర్ధ రూపాయో ఎక్కువగా తీసుకునే ప్రయత్నం చేస్తాడన్నమాట.

తిరుగు ప్రయాణంలో... బాషా పాటించే వ్యాపార సూత్రం ఇదే!

"ఇంతకూ షికారు కోసం ఆ పిల్లలు ఎక్కిన గుర్రం, ఎందుకలా ప్రవర్తించి ఉంటుంది?" అడిగాడు అప్పన్న.

"ఏమో? అది కూడా స్వాతంత్ర్యాన్ని కోరుకుంటుందేమో?" అన్నాడు సుబ్బారావు.

వీళ్ళ సంభాషణ బాషాకు అర్థం కాలేదు. అర్థం అయ్యే అవకాశమూ లేదు. కానీ... బగ్గీని లాగుతున్న గుర్రానికి మాత్రం అర్థమయ్యింది.

"అబ్బా! సుబ్బారావుగారు. ఎంత కరెక్ట్ గా చెప్పారండీ. అడవిలోకి పరుగెత్తిన ఆ గుర్రం సకిలించి మరీ వెళ్ళింది కదా. మీ మనుషులకు అది సకిలింపు మాత్రమే. స్వేచ్ఛా వాయువులు పీల్చుకోవడం కోసం, మనుషుల నుండి తప్పించుకున్న ఆనందంలో పెట్టిన కేకలు అవి!..." అనుకుంది గుర్రం.

సమయం రాత్రి అవ్వొస్తోంది.

నిజాం ఇచ్చే విందులో జరగబోయే ఆసక్తికరమైన సంఘటనల కోసం... కాలం, గుర్రపు బగ్గీలా పరుగెత్తుతోంది.

✦✦✦

సుబ్బారావు,అప్పన్న సికిందరాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో గుర్రం బగ్గీ దిగారు.

నాణేలు తీసి బాషా చేతిలో ఉంచారు.

బాషా, నసుగుతూ...


"షాబ్! గుర్రానికి గుగ్గిళ్ల కోసం హేమైనా ఇవ్వండి షాబ్!" అన్నాడు.

"ఓ పట్టు పంచ, లాల్చీ...ఇవ్వమంటావా? లేక బ్రిటీష్‌వారి లాంటి, సూటొకటి ఇవ్వమంటావా?" అన్నాడు అప్పన్న వెటకారంగా.

"గరీబోన్ని షాబ్! మీకు ఎంత తోస్తే అంత ఇయ్యండి షాబ్!" అన్నాడు బాషా.

'మరీ ఎక్కువ ఇవ్వకండి...ఈ బాషా గాడు తాగి తందనాలాడ్తాడు!' అన్నట్లుగా సకిలించింది గుర్రం.

మరో పది పైసలు తీసి బాషా చేతిలో పెట్టారు.



"అచ్చా! షుక్రియా షాబ్!"అనేసి బాషా బగ్గీ తోలుకుంటూ వెళ్ళిపోయాడు.

గుర్రపు బగ్గీ ప్రయాణంతో ఒళ్లంతా హూనం అయినట్లు అనిపించడంతో.. సుబ్బారావు, అప్పన్న స్నానాలు చేసి... తమ టెంట్ లోకి వెళ్లి కాసేపు నిద్రించారు.

సమయం సరిగ్గా సాయంత్రం ఆరున్నర అయ్యింది.

ఇద్దరూ లేచి, రెడీ అయ్యారు.

నిజాం ఇచ్చే విందుభోజనం కాబట్టి... ఇద్దరూ తెల్లచొక్కాలు, నల్ల ప్యాంట్లు వేసుకొని, ఇన్-షర్ట్ చేసుకున్నారు.

ఆ తర్వాత, వంటికి జవ్వాది రాసుకొని రోడ్డు దగ్గరికి వచ్చారు.

ఇంకో గుర్రపుబగ్గీ ఎక్కి, నిజాం రాజు విందు ఇచ్చే భవనం ముందు దిగారు.


నిజాం రాజు ప్యాలెస్ కు ఓ పక్కగా గుర్రపు బగ్గీలు, కొన్ని కార్లు ఆగి ఉన్నాయి.

వీళ్ళు ప్రధాన ద్వారం దగ్గరికి రాగానే... అక్కడున్న నిజాం రాజు సైనికులు ఆపి వివరాలు అడిగారు.

వీళ్లు వివరాలు చెప్పాక, ఒక సైనికుడు లోపలికి వెళ్ళి... మరో సైనికుడిని పిల్చుకొచ్చాడు.

అతని చేతిలో ఉన్న కాగితంలో ఉర్దూలో అతిధుల పేర్లు, వివరాలు రాసి ఉన్నాయి. అది చెక్ చేసి, వీరిద్దరిని లోపలికి పంపారు.

లోపలికి వెళ్ళాక, మెట్లు కనిపించాయి.




ఆ మెట్లు ఎక్కి పైకి వెళ్ళారు. మేడ మీద కారిడార్ లో నడుస్తుంటే, వరసగా ఎన్నెన్నో గదులు ఉన్నాయి.

"ఇందులో ఏ గది అయ్యుంటుంది సుబ్బారావు గారు?"

"నాకేం తెలుసండీ అప్పన్న గారు? వెతికి చావాలి... ఎక్కడ చూసిన ఉర్దూ పేర్లు. ఉర్దూ వాక్యాలూ..."

"అదేమిటి...మీకు ఉర్దూ వచ్చు కదా?"

"మాట్లాడడం వచ్చుండీ!... చదవడం... రాయడం రాదు!" అన్నాడు.

ఈ లోపు, ఉదయం నుండి ఫాలో ఐన పొట్టి వ్యక్తి కనిపించాడు.

వీరిద్దరినీ చూడగానే కంగారు పడ్డాడు.

"నమస్తే భాయ్..ఇక్కడ దావత్ హెక్కడా హై?"అన్నాడు సుబ్బారావు.

"ముఝే నహీ మాలుం!" అన్నాడు పొట్టి వ్యక్తి కంగారుగా.

"హేమీ తెల్వకుండా... ఈ ప్యాలెస్‌కు హెందుకు వచ్చినవ్ హై?"

"ముఝే నహీ మాలుం!"

"అరేయ్! ఆ వాక్యం తప్ప ఇంకేదైనా మాట్లాడి చావు! లేకపోతే... మేడ మీది నుండి నిన్ను కిందికి తోసి... జైలుకు పోతా!" అన్నాడు అప్పన్న చిరాగ్గా.

"ముఝే నహీ మాలుం!" అనేసి... అక్కడి నుండి వెళ్ళిపోయాడు.

ఈ లోపు ఒక సైనికుడు వీరికి ఎదురొచ్చాడు.

"యహా దావత్ ఖానా కహా చేస్తున్నారు హై?" అన్నాడు సుబ్బారావు.

"కిచెనా సాబ్?" అన్నాడు ఆ సైనికుడు.

"కాదు! ఖానా..." అంటూ తింటున్నట్లుగా అభినయించి చూపాడు సుబ్బారావు.


"ఓహ్..దావత్ కా కమ్రా. వహా..." అని చూపించాడు.

"షుక్రియా!" అన్నాడు సుబ్బారావు.

ఇద్దరు, విందుభోజనం ఇచ్చే హాల్‌లోకి అడుగుపెట్టారు.

హాల్ అంటే ఏదో చిన్నాచితకా గది కాదు. రెండు వందల మంది పట్టేంతటి భారీ హాల్.

హాల్‌కు ఒకవైపు వేదిక... వేదిక మీద



ముగ్గురు కూర్చొని... ఉర్దూలో ఖవ్వాలీ పాడుతున్నారు.

"మొహబ్బత్.. అనే ఒకటే పదాన్ని పట్టుకుని... దాన్ని లాగుతూ, పీకుతూ, రక్కుతూ, కొరుకుతూ, బాదుతూ, ఉతుకుతూ, తొక్కుతూ, గుద్దుతూ, సాగదీస్తూ...ఉన్నాడు.

ఇంతకూ ఈ ఖవ్వాలికి అర్థం ఏమిటో?" అన్నాడు అప్పన్న.


"నాకు మాత్రం ఏం తెలుసు అప్పన్న గారు! ఓసారి తేరి మొహబ్బాత్ అంటాడు.... ఓసారి మేరి మొహబ్బత్ అంటాడు... ఇంకోసారి తేరే మేరే మొహబ్బాత్‌కీ అంటూ ఏంటో పాడుతున్నాడు... ఇంకోసారి ఏ మొహబ్బత్ అంటాడు... ఏంటో ఈ గోల! చక్కగా ఎవరైనా ఓ తెలుగు పాట పాడితే, విని ఆనందిస్తాం కదా!" అన్నాడు సుబ్బారావు.

హాలును మధ్యలో విభజిస్తున్నట్లుగా వేదిక నుండి, చివరి దాకా నిలువుగా ఒక పెద్ద తెర ఉంది. అది పర్మనెంట్‌గా ఉండే తెర అని అర్థం అవుతోంది.

ఇక మధ్య మధ్యలో గుండ్రంగా బల్లలు, వాటి చుట్టూ ఆరు చొప్పున కుర్చీలు వేసి ఉన్నాయి. ఆ బల్లల పై మంచి నీళ్ళు, గ్లాసులు, బోర్లించిన పింగాణీ పేట్లు ఉన్నాయి.

ప్యాలెస్‌లో ఎక్కువ శాతం ముస్లీములు ఉన్నారు. వారిలో ఎక్కువ శాతం నిజాం రాజు బంధువులే.

కొందరు బ్రిటీష్ అతిధులు... కొందరు




జమీందార్లు... ఇంకొందరు సుబ్బారావు, అప్పన్నలాగా నిజాం బంధువుల అతిధులు... నిజాం కుటుంబంలోని వారు పిలిచిన అతిధులు ఉన్నారు.

తెరకు ఇటు వైపున్న బల్లల దగ్గర పురుష అతిధులు కూర్చుంటే, మరో వైపు స్త్రీలు కూర్చుకుంటారని వీరికి అర్థమైపోయింది.

హాల్ లో మొత్తం 80 మంది దాకా పురుషులు ఉన్నారు. అటువైపు స్త్రీలు ఎందరున్నారో తెలీదు.

"ఏ బల్ల దగ్గర కూర్చుందామంటారు?" అడిగాడు అప్పన్న.

"వడ్డించేవారు మనకు తెలిసినవారు కాదు. కాబట్టి, ఎక్కడ కూర్చుంటే ఏం చెప్పండి..." అన్నాడు సుబ్బారావు.

ఇద్దరు, ఓ బల్ల దగ్గరున్న కుర్చీలలో కూర్చున్నారు.

"మనల్ని ఇక్కడికి ఆహ్వానించిన స్త్రీ ఇక్కడికొచ్చి మనతో మాట్లాడలేదు. ఈ లెక్కన, ఇక మనల్ని ఎవరూ పలకరించరేమో!" అని సుబ్బారావు అంటుండగానే, ఆరడుగుల ఎత్తున్న ఒక వ్యక్తి వారి దగ్గరికొచ్చి పలకరించాడు.

ఆ వ్యక్తికి పొడుగాటి గెడ్డం ఉంది. ఖరీదైన జుబ్బా, బూట్లు ధరించి ఉన్నాడు. ఆ వ్యక్తి పక్కనే తాము ఆ రోజు కాపాడిన ఇద్దరు పిల్లలు ఉన్నారు.

"సలాం ఆలేకుం!" అన్నాడు ఆ వ్యక్తి.

"నమస్తే!" అన్నాడు సుబ్బారావు.


ఆ వ్యక్తి... సుబ్బారావుతో ఉర్దూలో ఏదో మాట్లాడాడు.

మధ్య మధ్యలో అప్పన్న వంక కూడా మెచ్చుకోలుగా చూసాడు.

అప్పన్నకు ఏమీ అర్థం కాక, ...

"హా... హ్వా ... హూ... హ్వూ... హై..." అంటూ ఇబ్బందిగా కదులుతూ, చిరునవ్వు నవ్వాడు.

ఆ తర్వాత ఆ వ్యక్తి, టిప్-టాప్ గా డ్రెస్ లో ఉన్న సర్వర్లను పిలిచి, ప్రత్యేకంగా వారికి.. వీరిద్దరినీ చూపించి మరీ ఏదో ఉర్దూలో చెప్పాడు. **(సశేషం)**



# అడ్డం తిరిగిన ప్లాన్!



కుంతి (కె. కౌండిన్య తిలక్)
8790920745

**"సర్! మా అబ్బాయికి స్కూల్ఫీజుకట్టాలి.. కాస్త పర్మీషన్ ఇవ్వండి!" అన్నాడు ఆనందం భయంగా బాస్‌తో.**

**"పొద్దున్నే పర్మీషన్ అంటూ వస్తారు. గుట్టలు గుట్టలుగా ఫైళ్ళు పడి ఉన్నాయి! ఎవరు ఆ పని చేస్తారు? నోపర్మీషన్!" అన్నాడు బాస్**

**ఇంతలో ఫోన్మోగింది. "యస్ డార్లింగ్!... కనుక్కుంటూనే ఉన్నాను. అందరికీ చెప్పి ఉంచాను!" అంటూఫోన్ పెట్టేసి, ఆనందం వైపుచూసి– "ఇంకా తమరు వెళ్ళలేదా?" అన్నాడు.**

**"సార్!... మీరేదో టెన్షన్‌లో ఉన్నారూ..." దీర్ఘం తీసాడు.**

"ఉదయం నుండి మా పమ్మీ కనబడడం లేదు. తీయని ఆరా లేదు. వెదుకని చోటు లేదు!" అన్నాడు కంగారుగా.

పమ్మీ అని చెప్పగానే ఎపుడో ఆఫీసర్ ఇంటికి వెళ్లినపుడు అస హ్యంగా చొంగ కారుస్తూ కనిపించిన నల్లమచ్చలున్న తెల్ల కుక్క గుర్తుకు వచ్చింది ఆనందానికి.

"ఆ కుక్క పిల్ల కనబడకపోవడంతో వీళ్ళుహైరానా పడుతున్నట్లున్నారు కాబోలు.

'ఈ సిచ్యువేషన్‌ని ఉపయోగించుకొని... బాస్ మెప్పు పొందాలి... పైగా ప్రమోషన్ లిస్ట్‌లో ఉన్నాను. కాబట్టి 'దానినివెతికి' పట్టుకుంటే ప్రమోషన్ ఖాయం!' అనుకున్నాడు మనసులో.

వెంటనే తన ముఖాన్ని బాధగాపెడుతూ– "ఓహ్! పమ్మీ కనబడడం లేదా?" అన్నాడు.

"యేం నీకు పమ్మీ తెలుసా?" అన్నాడు బాస్.

"చలాకిగా ఉండే పమ్మీ నాకు తెలియక పోవడం యేమిటి సార్!... నాకొక్క అవకాశం ఇవ్వండి. ఊరంతా వెతికి సాయంత్రం లోపు... మీ పమ్మీని మీకు అప్పచెప్పుతాను!" అన్నాడు.

"అయితే వెళ్ళు!" అన్నాడు బాస్.

ఆనందం ఊపిరి పీల్చుకొని బయట పడ్డాడు. ముందుగా తన పని చేసుకుందామని పిల్లవాడి స్కూల్కువెళ్ళాడు.

"ఈ రోజు మాస్కూల్లో సిస్టమ్స్ పని చేయడం లేదు... రేపు రండి!" అనడంతో, తన పని కానందుకు బాధపడుతూ బాస్ పని కోసం వీధుల వెంబడిపడ్డాడు. మధ్యాహ్నం వరకు టౌన్ అంతా వెతికినా ఆ కుక్కపిల్ల అతనికి కనబడ లేదు. చివరికి అతని ఫ్రెండ్ అప్పలరాజు కుక్కల వ్యాపారం చేస్తాడని గుర్తుకు రావడంతో అతనికి ఫోన్ చేశాడు.

"నాకు అర్జెంట్‌గా నల్ల మచ్చలున్న తెల్లకుక్క కావాలిరా!" అన్నాడు.

"ఇరవైఅయిదు వేలుపట్టుకు రా ఇస్తాను!" అన్నాడు అప్పలరాజు.

"ఆఫీస్‌లో ప్రమోషన్ లిస్ట్‌లో నాపేరు ఉంది. మా ఆఫీసర్ దగ్గర ఇంప్రెషన్ సంపాదించుకుంటే నాపని అయినట్లే. లక్కీగా మా ఆఫీసర్ కుక్కపిల్ల కనబడటంలేదు. అలాంటి కుక్కను తీసుకు వెళ్ళి అతనికి ఇస్తాను. అతడు ఎలాగో ఈ కుక్క మాది కాదంటాడు. అపుడు మళ్ళీ నీ కుక్క నీకు తెచ్చి ఇస్తాను... దాని వల్ల అతని దగ్గర ఇంప్రెషన్ పొందినట్లు ఉంటుంది... నా ప్రమోషన్‌కు హెల్ప్ అవుతుంది. ఏమంటావ్?" అన్నాడు.

"అయితే పట్టుకుపో! కాని ఒక్క మాట నా దగ్గర చాలా ఖరీదైన కుక్కలున్నాయి. తక్కువకు తక్కువ పాతికవేలు... నీవు తీసుకు వెళ్ళి వెంటనే మళ్ళీ తీసుకుని రావాలి! తీసుకు రాక పోతే మాత్రం దాని ఖరీదు కట్టి ఇవ్వాలి!" అన్నాడు.


"అలాగే!" అంటూ, అప్పలరాజు వద్దకు వెళ్ళి బాస్ వాళ్ళ ఇంటిలో చూసినటువంటి నల్లమచ్చలున్న ఒక తెల్లకుక్కను తీసుకున్నాడు.

"ఒరేయ్! జాగ్రత్త! దాని ధర పాతికవేలు! జాగ్రత్తగా తెచ్చివ్వు!" అన్నాడు.

అలాగే అంటూ కుక్కను తీసుకొని బాస్ ఇంటికి వెళ్ళాడు.

కాలింగ్ బెల్ కొట్టాడు.

బాస్ తలుపు తెరిచాడు. పొద్దున నుండి ఎండలో తిరిగి... తిరిగి కాకిలా తయారై ఉన్న ఆనందాన్నీ, పక్కనే ఉన్న కుక్కను అసహ్యంగా



చూస్తూ – "యేమిటీ! ఇప్పుడువచ్చావు?" అన్నాడు

"సార్! మీ పమ్మీని పట్టుకు వచ్చాను... చూడండి!" అంటూ కుక్కను చూపించాడు.

"ఓహ్! నైస్! మా పమ్మీని పట్టుకు వచ్చావు అన్న మాట, వెరీగుడ్!" అని అంటూ... ఇంటి లోపలి వైపు చూస్తూ...

"పమ్మీ!... పరిమళా!... ఇలారామ్మా!" అంటూ పిలిచాడు.

ఇంతలో అక్కడికి ఇరవైయేళ్ళ అమ్మాయి వచ్చింది.

"వాట్ డాడీ!ఎందుకుపిలిచారు?" అంటూ ఆగంతకుని వైపు చూస్తూ అడిగింది.

'ఇతడు మా అఫీస్‌లో పని చేస్తాడు... ఉదయం నీవు మాకు చెప్పకుండా నీ ఫ్రెండ్ ఇంటికి వెళ్ళడంతో నీ గురించి కొన్ని గంటల సేపు మాకు తెలియకపోవడంతో నేనూ మీ అమ్మా కంగారూ పడ్డాం... అదిగో అలాంటి సమయంలో మా పమ్మీ కనబడడం లేదని నేను అంటే, పమ్మీ అంటే కుక్క అనుకొని ఈ కుక్కను పట్టుకువచ్చాడు. ఇడియట్!" అంటూ పళ్ళు కొరికాడు.

"సార్! సారీ సార్! నేనుపమ్మీ అంటే మీ కుక్క అనుకున్నాను" అంటూ నీళ్ళు నమిలాడు.

"నౌ యూ గెట్ అవుట్!.." అంటూ కోపంగా అన్నాడు.

తనప్లాన్ దెబ్బ తిన్నందుకు బాధపడుతూ, రేపటి నుండి వీడితో ఎలా వేగాలో అని భయపడుతూ ఉండగా...

ఈ హడావిడికి ఆఫీసర్ గారి భార్యఅ క్కడికి వచ్చింది.

ఆనందం చేతిలో ఉన్న కుక్క పిల్లను చూసింది.

వెంటనే, "ఓహ్! నైస్ డాగ్!" అన్నది.


"డార్లింగ్! డుయూ లైక్ ఇట్! "అన్నాడుఆఫీసర్.

"యస్! " అన్నది ఆవిడ ఆనందంగా.

"ఆనందం మన కోసమే తెచ్చాడు. తీసుకో! పెంచుకో!!" అన్నాడు.

తన ప్లాన్ అడ్డం తిరిగినందుకు...ఆనందానికి పచ్చివెలక్కాయ గొంతులో పడ్డట్లు అయింది.

ఏమి మాట్లాడాలో తోచక, కుక్కను బాస్ చేతొలో పెడుతూ కుక్కలా వంకర్లు తిరుగుతూ, నమస్కారాలుపెడుతూ, అక్కడినుండి 'బతుకు జీవుడా' అంటూ బయటపడ్డాడు.



ప్రతినెలా ఆరోగ్యకరమైన హాస్యంతో, వెలువడుతున్న ఏకైక హాస్య మాస పత్రిక

# హాస్యానందం

గత 20 ఏళ్ళుగా ఇంటిల్లిపాదినీ
నవ్వించే పని పెట్టుకున్న ఏకైక తెలుగు హాస్య మాస పత్రికకు
చందాదారులుగా చేరండి...
ఆరు రుతువుల్లో నవ్వుల ఆమనిని ఆస్వాదించండి!

| సంవత్సర చందా- రూ 300/-లు | రెండేళ్ళ చందా- రూ 500/-లు |
| --- | --- |

**జీవితచందా- రూ 5000/-**




**జీవిత చందాదారులకు ఆఫర్లు:**

- వీరికి పత్రిక ప్రతినెలా రిజిష్టర్ పోస్ట్‌లో పంపబడుతుంది.
- సంవత్సరంలో ఒక నెల వీరి కోరిక మేరకు 'శుభాకాంక్షలు' ప్రకటన ప్రచురిస్తాం!

మరిన్ని వివరాలకు
9 8 4 9 6 3 0 6 3 7 నెంబరకు
సంప్రదించండి!

Owned & Published by : Ramu Panda from D.No.8-215/4, Yerrabalem, Guntur Dist.
Printed at: Rainbow Print Pack, Hyderabad. Edited by.Ramu.P

# ఆహ్వానము

## శ్రీ గుదిబండి వెంకటరెడ్డి గారి సౌజన్యంతో


## హాస్యానందం నిర్వహించిన

## మినీ హాస్య కథల పోటీ

# విజేతలకు బహుమతి ప్రదానోత్సవం

తేదీ: **18-09-2022, ఆదివారం, ఉదయం 10గంటలకు**

వేదిక: డా॥ కె.వి.రమణగారి క్యాంప్ కార్యాలయం, ఎ.సి.గార్డ్స్, మసాబ్ ట్యాంక్, హైదరాబాద్

**ముఖ్య అతిథి:** డా॥కె.వి.రమణ, ఐ.ఎ.ఎస్.(రి)
తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు

**సభాధ్యక్షులు:** డా॥ చిల్లా రాజశేఖర రెడ్డి
కళా పోషకులు

**సభ ప్రారంభం:** శ్రీ లంక లక్ష్మీనారాయణ
యువకళావాహిని అధ్యక్షులు

**అతిథి సత్కారం:** డా॥ సుదర్శనం
ప్రముఖ హాస్య నటులు

**బహుమతి ప్రదాత:** శ్రీగుదిబండి వెంకటరెడ్డి
కళా పోషకులు

**గౌరవ అతిథి:** శ్రీ కె.వి.వి.సత్యనారాయణ
కళా పోషకులు

### బహుమతి గ్రహీతలు

- వసుంధర, హైదరాబాద్
- సింహప్రసాద్, హైదరాబాద్
- కె.ఎన్.వి.ఆంజనేయులు, విశాఖపట్టణం
- గంగాధర్ వడ్లమన్నాటి, విశాఖపట్టణం
- కె. రాధా హిమబిందు,హైదరాబాద్
- గంటి ఉషాబాల, వరంగల్
- ఓట్ర ప్రకాష్ రావు, తిరుత్తని
- పద్మావతి తల్లోజు,మహబూబ్‌నగర్
- తెలికిచెర్ల విజయలక్ష్మి, హైదరాబాద్
- కట్టా రాంబాబు, విజయవాడ

## పదానందం పుస్తకావిష్కరణ

Hasyanandam September 2022. RNI No. APTEL 08387/01/1/2003-TC

రండి! దర్శించండి!! తరించండి!!!

# శ్రీ అష్టాదశ శక్తిపీఠ సహిత శ్రీరామలింగేశ్వర స్వామి దేవస్థానం



**కీ॥శే॥ శ్రీ గట్టు రాం రాజేశం గుప్తగారి సత్సంకల్పముతో...**

గౌ॥ శ్రీమాన్ కె.వి.రమణాచారి IAS, Retd గారి పర్యవేక్షణలో...

## ఆనంద నిలయం ఆవరణలో
## గ్రా॥ కొండపాక. జి॥ సిద్ధిపేట

అమ్మవారి అనంతరూపాలలో అష్టాదశ శక్తి స్వరూపాలు అత్యంత శక్తివంతమైన రూపాలు. ఒక్కో రూపం ఒక్కోరకంగా ప్రభావవంతమైనది. అమ్మవారి ఆవిర్భావంతో, మన భారతావని పవిత్ర పుణ్యక్షేత్రంగా విరాజిల్లుచున్నది. అంతటి గొప్ప మహిమాన్విత శక్తిపీఠ క్షేత్రంగా భారతదేశంలో, మన తెలంగాణ రాష్ట్రంలో సిద్ధిపేట జిల్లాలోని కొండపాక గ్రామంలో ఆగమశాస్త్ర విధానంలో వాస్తురీత్యా చక్కని శిల్పసంపదతో నాణ్యత గల నిర్మాణముతో శ్రీశ్రీశ్రీ పుష్పగిరి పీఠాదీశ్వరుల.... ఆశీరనుగ్రహ నిర్వహణలో త్యాగధనుల విరాళములతో ఒక అద్భుతమైన అష్టాదశ శక్తి క్షేత్రంగా శాస్త్రీయ విధానంగా అతి త్వరలో వైభవోపేతంగా ప్రతిష్ఠింపబడుతున్నదని తెలుపుటకు సంతోషిస్తున్నాం. ఇంకా నిర్మాణంగా నున్న, రాజగోపురం, ధ్యాన మండపం, యజ్ఞశాల, వంటశాల, అర్చకుల గృహసముదాయం, భక్తులకు నివాస వసతి గృహసముదాయం అనేక హంగులతో సొబగులతో నిర్మించుటకు సంకల్పించినాం. ఇంతటి గొప్ప విశిష్ఠత గల వైభవోపేతమైన ఈ శాస్త్రీయ అష్టాదశ శక్తిపీఠ రామలింగేశ్వర స్వామి క్షేత్రానికి భక్తులు, దాతలు యథామతిగా యథారీతిన తమ తమ శక్త్యానుసారంగా తను, మన, ధన, సేవా సహకారాలందించి ఈ పవిత్ర పుణ్యకార్యక్రమంలో యథోచితంగా పాల్గొనగలరని సకల భక్తజనావళిని సాదరపూర్వకంగా ఆశిస్తూ ఆహ్వానిస్తున్నాం.

**ఆలయ ట్రస్టు సభ్యులుగా చేరడానికి రూ.3,00,000 విరాళం అందించి**
**శ్రీ స్వామివారి కృపకు పాత్రులు కండి!**

ట్రస్ట్‌కు ఇచ్చే విరాళాలకు ఇన్‌కంటాక్స్ 80-జి సెక్షన్ ప్రకారం ఆదాయపు పన్ను మినహాయింపు ఉంది.

**Provisional Approval Number AAHTA 8091JF20206**

Ashtadasha Shakthi Peetha Sahitha Ramalingeswara Swamy Charitable Trust,
A/C.No-39153802660, IFSC-SBIN005881, Branch: SBI, ADB, Siddipet

వివరాలకు సంప్రదించండి:

శ్రీ అయిత నాగరాజు-9583599999, శ్రీ పెద్ది వైకుంఠం-9440003943, శ్రీ గట్టు రవీందర్-9848504656